RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8
సంచిక (Issue) : 322 వెల - రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

మంగళవారం 11, ఏప్రిల్ 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

## సూదిమొనంత జాగా ఆక్రమించలేరు

### చైనాకు అమిత్ షా పరోక్ష హెచ్చరిక



ఇటానగర్, ఏప్రిల్ 10 (ప్రజా మంటలు) : భారతదేశానికి చెందిన సూదిమొనంత భూభాగాన్ని కూడా ఎవరూ ఆక్రమించుకోలేరని, దేశంపై చెడు దృష్టి సారించే సాహసం కూడా ఎవరూ చేయలేరని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. అది సాధ్యం కూడా కాదన్నారు. అలాంటి ప్రయత్నాలను తిప్పికొడతామన్నారు. ఈ విషయంలో కేంద్రం ధృఢచిత్తంతో ఉందని పరోక్షంగా

మిగతా... 2లో




# వేటు పడింది..

### బిఆర్ఎస్ నుంచి పొంగులేటి, జూపల్లిల సస్పెన్షన్

### పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని చర్చ

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ప్రజా మంటలు) : ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీమంత్రి జూపల్లి కృష్ణారావుపై బీఆర్ఎస్ అధిష్టానం వేటు వేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఇద్దరు నేతలను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ నిబంధనలు ఉల్లంఘించారని సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. కొత్తగూడెంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం లో సీఎం కేసీఆర్ టార్గెట్ గా ఇద్దరు నాయకులు విమర్శలు చేశారు. కొంతకాలంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్‌కు దూరంగా ఉంటున్నారు. సమయం, సందర్భం దొరికినప్పుడల్లా కేసీఆర్ ప్రభుత్వ పరిపాలనపై పొంగులేటి విమర్శలు చేస్తున్నారు. 9వ తేదీన కొత్తగూడెంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి జూపల్లి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. అక్కడ రాష్ట్ర ప్రభుత్వ తీరును తూర్పారపట్టారు. ఉద్యమం కోసం పోరాడిన నాయకులు, కార్యకర్తలపై కేసులు పెడుతారా..? ప్రజాప్రతినిధులకు కనీసం అపాయింట్ మెంట్ కూడా కేసీఆర్ ఇవ్వరా.. ? తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాల్జేశారని, ఇందుకోసమే తెలంగాణ తెచ్చుకున్నామా..? అని పొంగులేటి, జూపల్లిలు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఇద్దరు నాయకులు ఇప్పటి వరకూ బీఆర్ఎస్ కు రాజీనామా చేయలేదు. కానీ, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు.

మిగతా... 2లో

## పార్టీ కంటే వ్యక్తులు గొప్ప కాదు

**జూపల్లి, పొంగులేటి విషయంలో సరైన నిర్ణయం**

**సస్పెన్షన్‌పై మంత్రి నిరంజన్ రెడ్డి వ్యాఖ్య**



హైదరాబాద్, ఏప్రిల్ 10 (ప్రజా మంటలు): పార్టీ కంటే వ్యక్తులం గొప్ప అన్నట్లు పొంగులేటి, జూపల్లిలు హద్దుమీరి ప్రవర్తించారని మంత్రి నిరంజన్ రెడ్డి విమర్శించారు. వారు మారుతారని పార్టీ ఇన్నాళ్లు వేచి చూసిందని... కానీ మారకపోవడంతో అధినేత కేసీఆర్ కఠిన నిర్ణయం తీసుకున్నారని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, పొంగులేటి సుధాకర్ రెడ్డిల సస్పెండ్ అవడంపై మంత్రి నిరంజన్ రెడ్డి స్పందించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... కొంతకాలంగా జూపల్లి, పొంగులేటి పార్టీ క్రమశిక్షణ పాటించడం లేదన్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం

మిగతా... 2లో

**మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు, కార్యాచరణ**

# నేటికీ స్ఫూర్తిదాయకం



### పూలే బాటలోనే తెలంగాణ కార్యక్రమాలు

### పూలే ఆశయాలను కొనసాగించేలా అభివృద్ధి

### పూలే జయంతి సందర్భంగా సిఎం కెసిఆర్ సంస్మరణ

హైదరాబాద్,ఏప్రిల్10 (ప్రజా మంటలు) : ఈ దేశంలో మనుషులంతా అన్ని రంగాల్లో సమానత్వంతో జీవించాలని, ఆధిపత్య విలువలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ తన జీవితాన్ని ధారపోసిన భారతీయ సామాజిక తత్వవేత్త, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తిదాయకమేనని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే 197వ జయంతి సందర్భంగా ఈ దేశానికి పూలే చేసిన సేవలు, త్యాగాలను సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. వర్ణ, లింగ వివక్షకు వ్యతిరేకంగా, దళిత, గిరిజన, బహుజన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా జ్యోతిబా పూలే దాదాపు రెండు వందల ఏండ్ల క్రితమే కార్యాచరణ చేపట్టారని సీఎం పేర్కొన్నారు. వారు అనుసరించిన సామాజిక సమానత్వ పంథా, నాటి భారతీయ సమాజంలో కొనసాగుతున్న సాంప్రదాయ సామాజిక విలువలను, వ్యవస్థలను సమూలంగా మార్చివేసేందుకు బాటలు వేసిందని కేసీఆర్ తెలిపారు. గుణాత్మక మార్పు దిశగా.. దేశంలోని స్త్రీలు, దళిత బహుజనులు ఉద్యమించేలా పూలే కార్యాచరణ పురికొల్పిందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

మహాత్మా పూలేను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్వయంగా తన గురువుగా ప్రకటించుకున్నారని సీఎం గుర్తు చేసుకున్నారు. జ్యోతిరావు పూలే వంటి మహనీయుల ఆశయాలను నెరవేర్చేదిశగా తెలంగాణ ప్రభుత్వం తన ప్రాధాన్యతాక్రమాన్ని రూపొందించుకుని అభివృద్ధి సంక్షేమ కార్యాచరణను అమలు చేస్తున్నదని కేసీఆర్ స్పష్టం చేశారు. జ్యోతిబా పూలే అందించిన స్ఫూర్తితో 'వికాసమే వివక్షకు విరుగుడు' అనే విధానాన్ని అనుసరిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నదని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో నేడు తెలంగాణలోని దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాలు, మహిళలు.. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, విద్యాపరంగా మెరుగైన ఫలితాలు సాధించి సామాజిక సమానత్వ దిశగా పురోగమించాయని సీఎం పేర్కొన్నారు. ఁరాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో ఎక్కువ శాతం బహుజన వర్గాలు లబ్ధిదారులుగా వున్నారని సీఎం తెలిపారు. అందరితో పాటుగా దళితబంధు, షెడ్యూల్డ్ కులాలు,



తెగల ప్రత్యేక ప్రగతినిధి, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్, ఎస్సీలకు నైపుణ్య శిక్షణ, ఎస్సీలకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, షెడ్యూల్డ్ తెగల ప్రత్యేక ప్రగతి నిధి, పారిశ్రామికవేత్తలకు అండగా టీఎస్ ప్రైడ్, ఎస్టీలకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, గిరిజనులకు ఆత్మగౌరవ భవనాలు, గ్రామ పంచాయతీలుగా గిరిజన తండాలు వంటి అనేక కార్యక్రమాలను, ఎస్సీ ఎస్టీల ప్రగతి కోసం ప్రత్యేకంగా అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. ఇదే సందర్భంలో.. బీసీల వికాసానికి మహాత్మాజ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి, బీసీ గురుకులాలు, గొర్రెల పంపిణీ, బెస్త, ముదిరాజుల ఉపాధి కోసం చెరువుల్లో చేపల పెంపకం, బీసీలకు ఆత్మగౌరవ భవనాలు, గీత, చేనేత,

మిగతా... 2లో



## మూడు బిల్లులను ఆమోదించిన గవర్నర్

- సుప్రీంలో కేసు విచారణ సమయం
- గవర్నర్ తమిళసై అనూహ్య నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 (ప్రజా మంటలు): సుప్రీం కోర్టులో తెలంగాణ పెండింగ్ బిల్లుల ఆమోదం పిటిషన్ పై సోమవారం విచారణ జరగనున్న నేపథ్యంలో గవర్నర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై మూడు బిల్లులను వెంటనే ఆమోదించారు. మరో రెండు బిల్లులను వెనక్కి పంపారు. రెండు బిల్లులను రాష్ట్రపతి ఆమోదానికి పంపారు. మరో మూడు బిల్లులను గవర్నర్ తమిళిసై పెండింగ్‌లో పెట్టారు. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లుల ఆమోదం కోసం తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. చట్ట సభలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోద ముద్ర వేసేలా ఆదేశాలు

మిగతా... 2లో

**చరిత్రలో నిలిచిపోయేలా**

# తెలంగాణ కార్యక్రమాలు



- అభివృద్ధికి నమూనాగా నిలిచిన మన రాష్ట్రం
- కెసిఆర్ లాంటి నాయకుడి వల్లనే సాధ్యమయ్యింది.
- పలు కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి కెటిఆర్

రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్10(ప్రజా మంటలు): చరిత్రలో నిలిచిపోయే కార్యక్రమాలు తీసుకురావాలనే కల్పన కేవలం కేసీఆర్ లాంటి నాయకుడితోనే సాధ్యమవుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ తొమ్మిదేండ్లలో అన్ని రకాల కార్యక్రమాలు అద్భుతంగా జరిగాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు నిరంతరం, నిర్విఘ్నంగా సాగాలంటే కేసీఆర్ లాంటి మనసున్న నాయకుడు ఉంటేనే అమలవుతాయి.

మిగతా... 2లో



## వరంగల్ సిపి రంగనాథ్‌ను వదిలేది లేదు

- ఆయన అవినీతి చిట్టా లెక్కలు తీస్తున్నాం
- నా ఫోన్ మాయం చేసింది పోలీసులే
- బలగం సినిమా బంధాలను చూపింది
- కెసిఆర్ కుటుంబ విలువలు తెలుసుకోవాలి
- బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ప్రజా మంటలు) : సీఎం కేసీఆర్‌కు మానవ సంబంధాలు కాదు.. మనీ సంబంధాలే ముఖ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు.

మిగతా... 2లో

## ప్రజానాడి




## పంజరంలోంచి బయటపడ్డాను

**సస్పెన్షన్‌పై జూపల్లి స్పందన**

హైదరాబాద్,ఏప్రిల్10(ప్రజా మంటలు):బీఆర్ఎస్ పార్టీ నుంచి తనను సస్పెండ్ చేసినందుకు చాలా ఆనందంగా ఉందని మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పంజ



రంలో నుంచి బయటపడినట్లు ఉందన్నారు. దొరలగడీ నుంచి బయటకు వచ్చానని అన్నారు. ఈ సందర్భంగా సోమ వారం ఆయన ఎమ్మెల్యే క్వార్టర్స్ దగ్గర మీడియాతో మాట్లాడుతూ, పార్టీ సభ్యత్వం చేస్తామంటే కూడా పుస్తకాలు ఇవ్వలేదన్నారు. తనను ఎందుకు సస్పెండ్ చేస్తున్నారో సీఎం కేసీఆర్ చెప్పాలన్నారు. తన ప్రశ్నలకు సమాధానం చెప్పి సస్పెండ్ చేయాలన్నారు. బీఆర్ఎస్ బండారం బయటపడు తుందనే తనను సస్పెండ్ చేశారని జూపల్లి కృష్ణారావు అన్నారు. అంతకుముందు ఓల్డ్ ఎమ్మెల్యే

మిగతా... 2లో



## సభ్యత్వమే లేదంటూ.. సస్పెండ్ ఎలా చేస్తారు?

- వందరోజులుగా ప్రశ్నిస్తున్నా ఎందుకు స్పందించలేదు
- బంగారు తెలంగాణ పేరుతో ప్రజలను మోసం చేయలేదా
- ఖమ్మంలో ఓటమిపై ఏనాడైనా సమీక్షించారా
- ఎంపి సీటు ఇవ్వకుండా అవమానించింది నిజం కాదా
- బహిష్కరణపై ప్రశ్నలు సంధించిన పొంగులేటి

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ప్రజా మంటలు): తనకు బిఆర్ఎస్ సభ్యత్వమే లేదన్నవ ఆరు పార్టీ నుంచి ఎలా సస్పెండ్ చేస్తారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తనను పార్టీ నుంచి బహిష్కరించడంపై మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తనను సస్పెండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని ఆయన విస్మయం వ్యక్తం చేశారు. ఇన్ని రోజులకు దొరల గడీ నుంచి విముక్తి కలిగిందని, ఇప్పటికైనా సస్పెండ్ చేయడం ఆనందంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. తాను

మిగతా... 2లో



## భూదందాలతో డబ్బులు జమ

- లక్షల కోట్లు దండుకున్న కెసిఆర్
- అక్రమ సొమ్ముతో ఎన్నికల్లో ఖర్చు
- అంతడబ్బు ఎక్కడిదో చెప్పాలన్న రేవంత్

హైదరాబాద్,ఏప్రిల్10(ప్రజా మంటలు) : సీఎం కేసీఆర్ వద్ద లక్షల కోట్ల రూపాయల దోపిడీ సొమ్ము ఉందని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. దాంతోనే దేశంలో

మిగతా... 2లో

# వరంగల్ సిపి రంగనాథ్‌ను వదిలేది లేదు

**మొదటిపేజీ తరువాయి..**
గతంలో రేవంత్ రెడ్డిని తన బిడ్డ పెళ్లిని చూడకుండా చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబ విలువలు తెలుసుకోవాలని సూచించారు. బీజేపీ నేతలతో కలిసి ఆయన బలగం సినిమా చూశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగం తప్ప ఇంకేమి లేదన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై లాఠీ చార్జ్ చేసిన మూర్ఖుడు, తెలంగాణ ప్రజలని దోచుకుంటున్న మూర్ఖుడు.. ప్రజలను అరిగోస పెడుతున్న మూర్ఖుడు కేసీఆర్ అని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు బెయిల్ రావద్దు అని ఎలా అంటారని బండి సంజయ్ ప్రశ్నించారు. పోలీసులే తన ఫోన్ను దొంగిలించారని ఆరోపించారు. ప్రశాంత్ వాట్సాప్ చేస్తే తాను సాయంత్రం 5 గంటలకు చూసుకున్నా అంటున్నారు. కానీ ఎగ్జామ్ 11:30 కి అయిపోయింది కదా అన్నారు. వరంగల్ సీపీ రంగనాథ్ ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని..ఆయన విజయవాడ, ఖమ్మం, వరంగల్‌లో ఏమేమి దందాలు చేసాడో తెలుసన్నారు. అన్ని బయటకి తీసుకొస్తామన్నారు. ఈ క్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్‌పై పరువు నష్టం దావా వేయనున్నట్లు బండి సంజయ్ తెలిపారు. టెన్త్ క్లాస్ ఎగ్జామ్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో రంగనాథ్ నిరాధార ఆరోపణలపై కోర్టుకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. తన హక్కుల భంగంతోపాటు ఇతర విషయాలపై పార్లమెంట్ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేయనున్నారు. మరోవైపు.. రంగనాథ్‌పై వచ్చిన ఆరోపణలను వెలికి తీస్తానని ప్రకటించారు బండి సంజయ్. దానికి తగ్గట్లే.. బండి సంజయ్ కార్యాలయానికి ఆసక్తికరమైన డాక్యుమెంట్స్ కనిపించాయి. రంగనాథ్‌పై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై రిపోర్ట్ చేసుకున్నారు. రంగనాథ్‌పై ఉన్న ఆరోపణలను బండి సంజయ్ త్వరలో మీడియా ద్వారా బయట పెట్టే అవకాశం ఉంది. రెండు రోజుల క్రితం బీజేపీ ఎంపీలు బండి సంజయ్ అరెస్ట్ పై లోక్ సభ స్పీకర్‌కు కంప్లెంట్ చేసిన సంగతి తెలిసిందే. బీజేపీ రాజ్య సభ సభ్యుడు డాక్టర్.లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎంపీలు సోయం బాపూరావు,



జీవీఎల్ నర్సింహారావు పార్లమెంట్‌లోని స్పీకర్ చాంబర్‌లో స్పీకర్ ఓం బిర్లాను కలిసి ఫిర్యాదు నోటీసు అందజేశారు. పార్లమెంటు సమావేశాల టైం లో ఎంపీ సంజయ్ హక్కులను కరీంనగర్ పోలీసులు కాలరాశారని రెండు పేజీల కంప్లైంట్‌ను అందించారు. లోక్ సభ సభ్యుడి హక్కులను కాలరాసినందున పోలీసులను సభాహక్కుల ఉల్లంఘన కింద విచారించాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే, బండి సంజయ్ సెల్‌ఫోన్ మిస్సింగ్ మిస్టరీగా మారింది. బండి సంజయ్ ఫోన్ మిస్సింగ్‌పై ఫిర్యాదు కాపీని డీసీపీ ఆఫీసులో ఇవ్వనున్నామన్నారు బీజేపీ లీగల్ టీమ్ సభ్యులు. ఫోన్‌ను బండి సంజయ్ మిస్ చేసే అవకాశమే లేదని స్పష్టం చేశారు. ఫోన్ మిస్సవడంతోనే ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్నామన్నారు బీజేపీ లీగల్ టీమ్ సభ్యులు. మానవ సంబంధాలు తెలియని కేసీఆర్ కు బలగం సినిమా అంకితమన్నారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్. ఏప్రిల్ 10వ తేదీ సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని దేవి థియేటర్ లో బలగం సినిమా చూశారాయన. బండి సంజయ్ తోపాటు ఇతర బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో థియేటర్ లో సినిమా చూశారు. 'బలగం సినిమా అద్భుతంగా ఉంది. మా కరీంనగర్ కి చెందిన వేణు డైరెక్షన్ లో వచ్చిన ఈ సినిమాలో మానవ సంబంధాలు, కుటుంబ బాధ్యతల గురించి చక్కగా చూపించారు. మన హిందు సనాతన ధర్మాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు. మనిషి బతికున్నప్పుడు, చనిపోయాక ప్రాముఖ్యతను బాగా చూపించారు. ప్రస్తుత సమాజంలో ఒకరు చనిపోతే దాన్ని 11 రోజులు పండుగలా చేసుకుంటున్నారు.. కానీ దాని ప్రాముఖ్యత ఎవరి తెలీదు. పిట్టకి పెడుతున్నారు కానీ కాకి ముట్టిందా లేదా అని పట్టించుకోట్లేదన్నారు. "పేరు, పబ్లిసిటీ, కలెక్షన్స్ కోసం చూడకుండా ఒక మంచి సినిమాని తీసిన వేణుకి నా అభినందనలు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన వేణు ఇప్పుడు నలుగురికి ఉపాధి కల్పిస్తున్నాడు. కేసీఆర్ కి మానవ సంబంధాలు కాదు.. మనీ సంబంధాలే ముఖ్యం. కేసీఆర్ కుటుంబ విలువలు తెలుసుకోవాలి. మానవ సంబంధాలు తెలియని కేసీఆర్ కు ఈ మూవీ అంకితం. ఈ సినిమా కేసీఆర్ చూడాలి. చూసి బంధాలు, వాటి విలువలు తెలుసుకోవాలని బండి సంజయ్ పేర్కొన్నారు.

### మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు, కార్యాచరణ

## నేటికీ స్ఫూర్తిదాయకం

**మొదటిపేజీ తరువాయి..**
మత్స్యకార్మికులకు ప్రమాద బీమా, కల్లు దుకాణాల పునరుద్ధరణ, గీత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమాలు, నేతన్నకు చేయూత, సెలూన్లకు ఉచిత విద్యుత్ ద్వారా నాయీ బ్రాహ్మణులకు చేయూత, రజకులకు ఆధునిక లాండ్రీ యంత్రాలు, దోభీ ఘాట్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను సంబంధిత వర్గాల సంక్షేమం కోసం అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. పూలే ఆశయ సాధన దిశగా మహిళలకు గురుకుల విద్యతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. అణగారిన వర్గాలు, బహుజనుల సమగ్ర వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు వారి సామాజిక, ఆర్థిక ఆత్మగౌరవాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయని సీఎం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఈ కృషి వెనుక మహాత్మా పూలే ఆదర్శాలు, ఆశయ సాధన లక్ష్యాలు ఇమిడి ఉన్నాయని సీఎం అన్నారు. తెలంగాణలో సాధిస్తున్న విజయాలు దేశానికి ఆదర్శంగా నిలిచిన నేపథ్యంలో భారత సమాజంలో అన్ని రంగాల్లో, అన్ని వర్గాలను సమానత్వం ఆవిష్కరించే దిశగా తెలంగాణ ప్రభుత్వం తన కార్యాచరణను కొనసాగిస్తూనే ఉంటుందని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

## పంజరంలోంచి బయటపడ్డాను

**మొదటిపేజీ తరువాయి..**
క్వార్టర్స్‌కు జూపల్లి కృష్ణారావు వచ్చారు. ఆయనను అసెంబ్లీ భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. స్పీకర్ అనుమతి లేదని చెప్పారు. దీంతో భద్రతా సిబ్బందితో జూపల్లి కృష్ణారావు వాగ్వాదానికి దిగారు. స్పీకర్ ఆదేశాల మేరకే అనుమతి లేదని భద్రతా సిబ్బంది తెలిపారు.
కాగా ఖమ్మం రాజకీయం ఆసక్తికరంగా మారుతోంది. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆత్మీయ సమ్మేళనానికి.. పలువురు బీఆర్ఎస్ కీలక నేతలు హాజరవుతారని ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ అసంతృప్తి నేతలంతా ఏకతాటిపైకి వస్తారని.. ఇప్పటికే జూపల్లి, పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. జూపల్లి వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరు నేతలకు ముఖ్యమంత్రి కేసీఆర్ షాక్ ఇచ్చారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా ఈ ఇద్దరు నేతలు అనుచరులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో ముఖ్యంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటిఆర్‌పై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. గత ఏడాదిన్నర నుంచి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పార్టీపై ఆగ్రహంతో ఉంటూ వస్తున్నారు. సీఎం కేసీఆర్‌పై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. అయినప్పటికీ అధిష్టానం ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా ఆయన మద్దతుదారులపై బీఆర్ఎస్ అధిష్టానం వేటు వేసింది. దమ్ముంటే తనపై వేటు వేయాలని ఇప్పటికే పొంగులేటి సవాల్ విసిరారు. ఈ క్రమంలో నిన్నటి ఆత్మీయ సమ్మేళనంలో పొంగులేటి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంది.

## మూడు బిల్లులను ఆమోదించిన గవర్నర్

**మొదటిపేజీ తరువాయి..**
ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రతివాదులుగా గవర్నర్ కార్యదర్శి, కేంద్ర న్యాయశాఖ కార్యదర్శిని చేర్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ ధర్మాసనం ముందు విచారణ జరగనుంది. ఇప్పటి వరకు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులు.. 1. అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా (టర్మినేషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ లీజు) (సవరణ) బిల్లు 2. తెలంగాణ మున్సిపల్ చట్టాల (సవరణ) బిల్లు 3. తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ (సవరణ) బిల్లు 4. యూనివర్శిటీ ఆఫ్ ఫారెస్ట్రీ తెలంగాణ బిల్లు 5. తెలంగాణ యూనివర్సిటీస్ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ బిల్లు 6. తెలంగాణ మోటార్ వెహికల్స్ టాక్సేషన్ (సవరణ) బిల్లు 7. తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు (స్థాపన, నియంత్రణ) (సవరణ) 8. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (సవరణ) బిల్లు 9. తెలంగాణ పంచాయతీ రాజ్ (సవరణ) బిల్లు 10. తెలంగాణ మునిసిపాలిటీల నిబంధనల చట్ట (సవరణ) బిల్లు. గత కొన్ని రోజులుగా గవర్నర్ తమిళిసై వద్ద పలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని ఆమోదించాలని కోరుతూ రాష్ట్ర సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గవర్నర్ వద్ద బిల్లుల ఆమోదాన్ని ఆలస్యం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తి, ప్రజల ఆకాంక్షకు విరుద్ధమని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది. మొత్తం 10 బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉన్నాయని పిటిషన్ లో పేర్కొంది. దీనిపై గవర్నర్ కార్యదర్శితో అడిషనల్ సోలిసిటరి జనరల్ ఇంతకుముందే చర్చించారు. రాజ్యాంగంలోని 200వ ఆర్టికల్ ప్రకారం గవర్నర్ బిల్లును ఆమోదించడం లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపాలని పిటిషన్‌లో ప్రభుత్వం పేర్కొంది.

## సభ్యత్వమే లేదంటూ..
# సస్పెండ్ ఎలా చేస్తారు?

**మొదటిపేజీ తరువాయి..**
సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించింది వాస్తవమని, జనవరి నుంచి పార్టీని.. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉన్నానని పొంగులేటి చెప్పుకొచ్చారు. ఇప్పుడు మీరు ధైర్యం తెచ్చుకొని సస్పెండ్ చేశారని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌లో సస్పెన్షన్లే ఉండవని ఒకరంటారని, దమ్ము, ధైర్యముంటే మీరే రాజీనామా చేయాలని మరొకరంటారని, తాను సభ్యుడినే కాదన్నప్పుడు ఎలా సస్పెండ్ చేశారని పొంగులేటి ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన తర్వాత మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ తో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధిస్తూనే...పలు ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పార్టీలో తనకు సభ్యత్వమే లేనప్పుడు సస్పెండ్ ఎలా చేస్తారని సూటిగా ప్రశ్నించారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం హాస్యాస్పదం అని చెప్పారు. వందల సార్లు బీఆర్ఎస్ పార్టీలోకి రమ్మని తనను పిలిచినా వెళ్లలేదన్నారు. ధైర్యం చేసి తనను సస్పెండ్ చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. గత వంద రోజుల నుంచే బీఆర్ఎస్ పార్టీని, ప్రభుత్వ పరిపాలన తీరును ప్రశ్నిస్తున్నానని చెప్పారు. తాను బీఆర్ఎస్ పార్టీలో ఉన్న సమయంలో చాలాసార్లు ఇబ్బందులు పెట్టినా, అవమానపర్చినా దిగమింగుకుని ఉన్నానని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా తనకు ఎంపీ సీటు ఇవ్వకపోయినా.. కేటీఆర్ గురించే బీఆర్ఎస్ లో ఉన్నానని చెప్పారు.' 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ నుంచి ఒక్క అభ్యర్థే గెలిచారు. 2018 ఎన్నికలపై ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులతో ఏనాడైనా సమీక్ష చేశారా..? తొమ్మిది మంది బీఆర్ఎస్ అభ్యర్థుల ఓటమిపై చర్చించారా..? ఒకవేళ ఓటమిపై చర్చించినట్లైతే.. ఆ సమస్యలను మీరు ఏ రకంగా పరిష్కరించారు..? తప్పు మీ పక్కన పెట్టుకుని.. ఫలితాలు వచ్చిన తర్వాత ఎదుటివారిపై నిందమోపడం ఎంతవరకూ సబబు..? ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొదటినుంచి కాంగ్రెస్, కమ్యూనిస్టుల ప్రాబల్యం ఎక్కువ. ఈ విషయం ఎవర్నీ అడిగినా చెబుతారు' అంటూ పొంగులేటి కామెంట్స్ చేశారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తుల మాటల నమ్మి.. నాకు, నా వాళ్లకు ఎలాంటి పదవులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిన మాట నిజం కదా..? ప్రజలు నన్ను తిరస్కరించలేదు. ప్రజలు నన్ను ఓడించలేదు. నా మొర ఏనాడు మీకు చెప్పుకోలేదు. నామా నాగేశ్వర్ రావును ఎంపీగా గెలిపించేందుకు చాలా కృషి చేశాను. ఆయన్ను నేను గెలిపించలేదా..? ఒకవేళ గెలిపించలేరని మీరు భావించినప్పుడు ఎలక్షన్స్ కు ముందు నాకు ఎందుకు బాధ్యతలు ఇచ్చి ప్రాథేయపడాలి..? నన్ను రెండోవ సారి కూడా మోసం చేసిన మాట వాస్తవం కదా..? ఎన్నికలయ్యాక రాజ్యసభ సీటు ఇస్తానన్న మీరు..ఇవ్వని మాట నిజం కాదా..? మా కుమారుడి రిసెప్షన్ కు వచ్చిన వేలాది మంది జనాన్ని చూసి.. మీ కళ్లు ఒర్చుకోలేక.. నాకు రాజ్యసభ సీటు ఇస్తే ప్రమాదమని గ్రహించి.. మోసం చేసిన మాట వాస్తవం కాదా..?' అని ప్రశ్నించారు. 'రెండోసారి తడిగుడ్డతో ఊచకోత కోసిన మాట నిజం కాదా.? రాజకీయంగా నన్ను సమాధి చేయాలనుకోవడం నిజం కాదా..? నా ఒంట్లో చివరి రక్తపు బొట్టు ఉన్నంత వరకూ ప్రజల్లో ఉండాలనే రాజకీయాల్లోకి వచ్చాను. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమయంలోనూ నాకు సంబంధించిన వ్యక్తులకు బీ ఫామ్స్ ఇచ్చారా...? నేను సిఫార్సు చేసిన ఏ ఒక్క వ్యక్తికి కూడా బీ ఫాం ఇవ్వలేదు. రాజకీయంగా నాన్ను సమాధి చేయాలనుకున్నది నిజం కాదా..? ప్రజల్లో గుండెల్లో ఉన్నంత వరకూ నన్ను మీరు ఏమీ చేయలేరని అంటూ పొంగులేటి కామెంట్స్ చేశారు.
బంగారు తెలంగాణ చేస్తామని చెప్పి ఇప్పుడేం చేస్తున్నారు. ఇప్పుడు తెలంగాణ బిడ్డలు అనేక ఇబ్బందులు పడుతున్నారు, పారదర్శక పాలన అందించడం ప్రభుత్వ బాధ్యత కాదా అని నిలదీసారు.
పాలేరు ఉపఎన్నికలో గెలుపు కోసం నాపై ఒత్తిడి తెచ్చారు. మంత్రి కేటీఆర్ నాతో అనేకసార్లు మాట్లాడారు. పార్టీలో నాకు సముచిత స్థానం కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. కేసీఆర్ మాటలు నమ్మి నేను బీఆర్ఎస్‌లో చేరాను. పార్టీలో చేరే నాటికి నేను తెలంగాణ వైసీపీ అధ్యక్షుడిని. ఆర్థిక ఇబ్బందులున్నా.. అవమానాలు ఎదురైనా భరించాను అని అన్నారు. తనకు టికెట్ ఇవ్వకపోయినా కేసీఆర్ కోసం పనిచేశా 2018లో ఖమ్మం ఓటమికి కారణం ఎవరో అందరికి తెలుసు..అలా అనిఖమ్మం జిల్లా సమస్యలపై ఏనాడైనా చర్చించారా..తప్పు మీ దగ్గర పెట్టుకుని నాపై నిందలేస్తారా అంటూ ఘాటుగా విమర్శలు గుప్పించారు.

# భూదందాలతో డబ్బులు జమ

**మొదటిపేజీ తరువాయి..**
ఎన్నికల్లో పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారని అన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో వందల కోట్లు ఖర్చు పెట్టారన్న ఆయన.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో భూదోపిడీకి పాల్పడ్డారంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ను అస్థిరపరిచేందుకు సీఎం కేసీఆర్ కుట్ర చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు కర్ణాటకలోనూ వందల కోట్లు ఖర్చు పెట్టేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అక్రమ సొమ్ముతో పార్టీలను కొనాలనుకుం టున్నారని, విపక్షాలకు ఇవ్వడానికి అన్ని కోట్లు ఎక్కడివి అని ఆయన ప్రశ్నించారు. దేశంలోని రాజకీయాలను కార్పొరేట్ రాజకీయాలుగా చేశారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. సిద్ధాంతాలతో నడిచే రాజకీయ పార్టీలను ఎన్నికల నిర్వహణకు, ప్రజా ప్రతినిధుల కొనుగోళ్లకు నిధులు లేవని.. కాబట్టి మీకు కావల్సిన వేల కోట్ల రూపాయలను నేను సమకూరుస్తాను.. నన్ను నాయకుడిగా మీరు స్వీకరించండి అంటూ సీఎం కేసీఆర్.. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో బేర సారాలు మొదలు పెట్టారన్నారు. ఏపీలో జరిగిన ఎన్నికల్లోనూ కేసీఆర్ వేల కోట్లు ఖర్చు పెట్టారనే వార్తలు వచ్చాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఏ ఎన్నికలు వచ్చినా వందలాది కోట్లు ఖర్చు పెట్టాలన్న ఆలోచన తప్ప, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని లేదని ఆరోపించారు. ఒక్క కేసీఆర్ వంద మంది దావూద్ ఇబ్రహీంలకు సమానమని సీఎం కేసీఆర్ పై రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్ భూదోపిడీపై సీబీఐకి లేఖ రాస్తానని ప్రకటించారు. కేసీఆర్ గజదొంగ.. ఆయనతో కాంగ్రెస్ కలువదని స్పష్టం చేశారు. జాతీయస్థాయిలో ప్రతిపక్షాల కూటమికి నాయకత్వం కోసం.. కేసీఆర్ ఆసక్తిగా ఉన్నట్లు జర్నలిస్ట్ రాజ్‌దీప్ చెప్పారని గుర్తుచేశారు. కేసీఆర్ మోడల్ అత్యంత ప్రమాదకరమైందని తప్పుబట్టారు. కేసీఆర్ దగ్గర లక్ష కోట్ల అవినీతి సొమ్ము ఉందని ఆరోపించారు. భూములను వనరుగా పెట్టుకుని వందల కోట్లు సంపాదిస్తున్నారని, ఉపఎన్నికల్లో వందల కోట్లు ఖర్చు చేశారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఏపీ ఎన్నికలకూ కేసీఆర్ వందల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. కర్నాటక లో జేడీఎస్ ద్వారా తన అస్తిత్వాన్ని కాపాడుకునే యత్నం చేస్తున్నారని తెలిపారు. దేశ రాజకీయాలను కేసీఆర్ శాసించాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌ను అస్థిరపరిచే ప్రయత్నం చేస్తున్నారని, కర్ణాటక ఎన్నికల కోసం మాజీసీఎం కుమారస్వామికి వందల కోట్లు ఇస్తున్నారని తెలిపారు. విపక్షాలకు ఇచ్చేందుకు కేసీఆర్కు÷– అంత డబ్బు ఎక్కడిదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో కేసీఆర్ భూదోపిడీకి పాల్పడ్డారని, తనతో ఉన్న వారందరికీ కేసీఆర్ భూములు పంచుతున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. హెటిరో పార్థసారథి కేసీఆర్ అనుచరుడు, పార్థసారథి సీబీఐ, ఈడీ దాడులు ఎదుర్కొన్నాడు. ఐటీ దాడుల్లో రూ.142 కోట్లు దొరికాయి. ఆర్థిక నేరగాడు పార్థసారథిరెడ్డికి రాజ్యసభ సీటు ఇచ్చారు. సాయిసింధు పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. 15 ఎకరాల భూమి కావాలని కేసీఆర్‌కు దరఖాస్తు చేశారు. అతి తక్కువ రేటుకే భూములు కట్టబెట్టారు. కేసీఆర్ భూదోపిడీని ధారావాహికగా బయట పెడతా. రేపు యశోద హాస్పిటల్స్కు భూకేటాయింపులపై.. దోపిడీ కోణం బయట పెడతా. రెమిడెసీవర్‌ను బ్లాక్‌లో అమ్ముకున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

# చరిత్రలో నిలిచిపోయేలా తెలంగాణ కార్యక్రమాలు

**మొదటిపేజీ తరువాయి..**
పేదలకు లాభం జరుగుతుంది. ఇంకెవరు వచ్చినా ఈ కార్యక్రమాలన్నీ మాయమైపోయే పరిస్థితి ఏర్పడుతది అని మంత్రి కేటీఆర్ తెలిపారు. అందుకే మళ్లీ కెసిఆర్‌ను



ఆశీర్వదించాలని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గండిలచ్చపేట గ్రామంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, సావిత్రీ భాయి పూలే విగ్రహాన్ని కేటీఆర్ ఆవిష్కరించారు. కేసీఆర్ ప్రగతి ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.
ఈ గ్రామంలో తెలంగాణ దళిత బంధు అనే కార్యక్రమం కింద ఇద్దరు సోదరులు కలిసి రూ. 25 లక్షలతో ఏర్పాటు చేసుకున్న పౌల్ట్రీ ఫాం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు కేటీఆర్. పోయినవారం ఎల్లారెడ్డిపేటలో దళితబంధు పథకం కింద రైస్ మిల్లును ప్రారంభించాం. పదిరె గ్రామంలో 9 మంది కలిసి 90 లక్షలతో పెట్రోల్ బంక్ పెట్టుకున్నారని కలెక్టర్ చెప్పారు. దాన్ని కూడా అంబేద్కర్ జయంతి తర్వాత ప్రారంభించుకుంటామని తెలిపారు. గండిలచ్చపేటలో దళిత బంధు కింద 30 కుటుంబాలు



వ్యాపారాలు మొదలు పెట్టాయి. ఆర్థికంగా ఎదుగుతున్నందుకు గండిలచ్చపేట దళితులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలపుతున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. దళిత బంధు లాంటి పథకాలు అమలు కావాలంటే నాయకుడికి గుండె నిండా ధైర్యం ఉండాలన్నారు కేటీఆర్. ఊకదంపుడు ఉపన్యాసాలతో ఐదేండ్లు టైం పాస్ చేసిన సీఎంలు చాలా మంది ఉన్నారని తెలిపారు. కానీ కేసీఆర్ ప్రవేశపెట్టిన దళితబంధుతో వ్యాపారాలు పెట్టి, లాభాలు పొందుతున్నామని లబ్దిదారులు చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 40 వేల కుటుంబాలకు లబ్ది జరిగిందని తెలిపారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి గ్రామంలో వైకుంఠధామం ఏర్పాటు చేసుకున్నాం అని కేటీఆర్ వెల్లడించారు. డంపింగ్ యార్డు, నర్సరీ, ట్రాక్టర్ ట్రాలీ, పల్లె ప్రకృతి వనం, తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసుకున్నాం. ఇలాంటి పథకాలు దేశంలోని ఇతర గ్రామాల్లో లేవు. ఈ తీరుగా పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఉత్తమ గ్రామపంచాయతీలు తెలంగాణలోనే ఉన్నాయని కేంద్రం ప్రకటించింది. ఇలాంటి పనులు చేయడం వల్లే అవార్డులు వస్తున్నాయన్నారు. కంటి వెలుగులాంటి కార్యక్రమం దేశంలో ఎక్కడా అమలు చేయడం లేదు. గుడ్డితనం వచ్చే దాకా బతికిన వారు చాలా మంది ఉన్నారు. వయసు పెరిగే కొద్ది కంటి, ఆరోగ్య సమస్యలు వస్తాయి. అందుకే సీఎం కేసీఆర్ నాయకత్వంలో కంటి వెలుగు కార్యక్రమం చేపట్టాం. అవసరమైన వారికి కండ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. ÷రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు కాంగ్రెస్, బీజేపీ నేతల కుటుంబాలకు అందడం లేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ ప్రభుత్వం రైతుబంధు అమలు చేయలేదు. కాంగ్రెస్, బీజేపీ నేతల ఇంటికి నీళ్లు, 24 గంటల నాణ్యమైన కరెంట్ వస్తలేదా..? రైతుబంధు, రైతుబీమా వస్తలేదా..? ఆసరా పెన్షన్లు వస్తలేవా.. ఇవన్నీ వాస్తవాలు కాదా..? ఆలోచించామని కోరుతున్నా.. విమర్శ కోసం విమర్శ చేయడం కాదు. నాయకుడికి దమ్ముంటే సంపద సృష్టించి పేదలకు పంచాలనే సంకల్పం ఉంటే ఇవన్నీ జరుగుతాయి. ఇదే గండిలచ్చపేటలో 2014కు ముందు ఒక ఎకరం భూమి విలువ ఎంత..? ఇవాళ ఎంత పెరిగింది అనేది ఆలోచించాలి అని కేటీఆర్ సూచించారు.

## పార్టీ కంటే ...
# వ్యక్తులు గొప్ప కాదు

**మొదటిపేజీ తరువాయి..**
తీసుకున్నారని తెలిపారు. అధినేత మీదనే మాట్లాడే స్థాయికి వెళ్ళడం పరాకాష్ట అని అన్నారు. తనను విమర్శించిన వారిని కూడా కేసీఆర్ దగ్గర తీసుకున్నారని అన్నారు. బలిదానాల గురించి మాట్లాడటానికి జూపల్లికి సిగ్గుండాలని మండిపడ్డారు. మొదటి నుంచి ఉన్నవారిని కాదని జూపల్లిని కేసీఆర్ మంత్రిని చేశారని గుర్తుచేశారు. గత ఎన్నికల్లో ఆ జిల్లాలో ఆయన ఒక్కరే ఓడిపోయారన్నారు. మీ మాటల్లో అర్థం ఉంటే పోయిన టర్మ్‌లో మంత్రి పదవి ఎందుకు తీసుకున్నారు. నువ్వు ప్రజా ప్రతినిధివే కాదు నీ ఫోన్ ఎందుకు ఎత్తుతారు. నియోజకవర్గానికి నీరు రాలేదంటే అది మీ వైఫల్యం.. మీరు పార్టీని బలహీనపర్చలేరని మంత్రి అన్నారు. జూపల్లి, పొంగులేటి ఎవరి ట్రాప్‌లో ఉన్నారో అందరికీ తెలుసన్నారు. కేసీఆర్‌ను వీడి బయటకు వెళ్లి సక్సెస్ అయిన వారు ఎవరూ లేరని తెలిపారు. పొంగులేటికి తెలంగాణ ప్రస్థానంలో అసలు పాత్రే లేదన్నారు. జూపల్లి మంత్రిగా ఉన్నప్పుడు జగన్ సీఎం కావాలని కోరుకున్నారని... జగన్ కోసం రాజీనామా చేస్తానని అన్నారని తెలిపారు. మంత్రి అయ్యాక కూడా వైఎస్ ఫోటో ఇంట్లో పెట్టుకున్నారని... మంత్రి పదవి ఇచ్చిన కేసీఆర్ ఫోటో మాత్రం పెట్టుకోలేదని విమర్శించారు. మంత్రి అయ్యాక తెలంగాణ తల్లి విగ్రహాలు కాకుండా వైఎస్ విగ్రహాలను పెట్టించారన్నారు. మీలాంటి ద్రోహులా మాట్లాడేది తెలంగాణ గురించి అంటూ మండిపడ్డారు. వీళ్ల మాటలన్నీ ఆంధ్ర నుంచి వచ్చి ఇక్కడ పార్టీ పెట్టి మాట్లాడేవారి మాటలే అంటూ మంత్రి నిరంజన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.

# వేటు పడింది..

**మొదటిపేజీ తరువాయి..**
తరచూ ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు. ఏప్రిల్ 9న ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పొంగులేటి, జూపల్లిపై బీఆర్ఎస్ అధిష్టానం వేటు వేసింది. గత మూడేళ్లుగా తనకు సభ్యత్వం కూడా ఇవ్వలేదని, అధిష్టానాన్ని కలిసే ప్రయత్నం చేసినా అపాయింట్ మెంట్ కూడా ఇవ్వలేదని జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. ఆదివారం జరిగిన సమావేశంలో సీఎం కేసీఆర్ తో పాటు పరిపాలన తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.
గత ఏడాదిన్నర నుంచి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పార్టీపై ఆగ్రహంతో ఉంటూ వస్తున్నారు. సీఎం కేసీఆర్‌పై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. అయినప్పటికీ అధిష్టానం ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా ఆయన మద్దతుదారులపై బీఆర్ఎస్ అధిష్టానం వేటు వేసింది. దమ్ముంటే తనపై వేటు వేయాలని ఇప్పటికే పొంగులేటి సవాల్ విసిరారు. ఈ క్రమంలో నిన్నటి ఆత్మీయ సమ్మేళనంలో పొంగులేటి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంది.
ఈ మేరకు కాసేపటి క్రితమే అధినేత కేసీఆర్ ప్రెస్‌నోట్‌ను విడుదల చేశారు. పార్టీ నుంచి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందన ఇరువురిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు లేఖలో తెలిపారు. ఇప్పటికే పొంగులేటి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి తన మద్దతుదార్ల పేర్లను ప్రకటించారు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్, పొంగులేటి వర్గానికి మాత్రమే పోటీ ఉంటుందని ఆయన ఇప్పటికే స్పష్టం చేశారు. మరోవైపు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి హర్షవర్ధన్ చేతిలో ఓడిపోయారు. ఆ తరువాత హర్షవర్ధన్ బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి జూపల్లి, హర్షవర్ధన్ మధ్య గొడవ రోజు రోజుకు ముదురుతున్న నేపథ్యంలో స్వయంగా మంత్రి కేటీఆరే రంగంలోకి దిగి జూపల్లిని బుజ్జగించారు.
అయినప్పటికీ పార్టీకి వ్యతిరేకంగా జూపల్లి వ్యాఖ్యలు చేశారు. పొంగులేటి వర్గంతో చేతులు కలపడంతో జూపల్లి కృష్ణారావుపైన కూడా పార్టీ అధిష్టానం చర్యలు తీసుకుంది. వీరిద్దరితో పాటు మరికొంతమంది నేతలను పొంగులేటి శిబిరంలో చేరే అవకాశాలు ఉన్న నేపథ్యంలో వారిపైనా కూడా బీఆర్ఎస్ అధిష్టానం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సాధారణంగా బీఆర్ఎస్ పార్టీ.. తమ నాయకులను పార్టీ నుంచి పెద్దగా సస్పెండ్ చేయదనే ప్రచారం ఉంది. అసంతృప్తిగా ఉన్న నాయకులు వాళ్లంతట వాళ్లే వెళ్లిపోయేలా చేస్తుందనే ఆరోపణ ఉంది.
2018లో ముగ్గురు రెబల్స్‌ను సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఇప్పటి వరకూ ఎవర్నీ సస్పెండ్ చేయలేదని తెలుస్తోంది. డీ. శ్రీనివాస్ విషయంలోనూ ఆయనపై బీఆర్ఎస్ అధిష్టానం వేటు వేయలేదు. ఆయనే స్వయంగా రాజీనామా చేసి, పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. మరోవైపు.. ఈ ఇద్దరు నాయకులు ఏ పార్టీలో చేరుతారానేది కూడా ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఏదైనా జాతీయ పార్టీలో చేరుతానని రెండు రోజుల క్రితమే పొంగులేటి ప్రకటించారు. అయితే.. ఆ జాతీయ పార్టీ కాంగ్రెస్సా, లేదా బీజేపీనా అనేది ఆసక్తిగా మారింది. మరి జూపల్లి పయనం ఏటు అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. గతంలో కాంగ్రెస్ లో పని చేశారు. మంత్రిగానూ సేవలందించారు.

## సూదిమొనంత జాగా ఆక్రమించలేరు

**మొదటిపేజీ తరువాయి..**
చైనాను మెచ్చరించారు. అరుణాచల్ ప్రదేశ్ లోని కిబితూలో 'వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రాం'ను సోమవారం నాడు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరిహద్దులను ఇండో–టిబిటన్ సరిహద్దు పోలీసులు, భారత ఆర్మీ కంటికిరెప్పలా చూసుకుంటున్నాయని, ఈ పరిస్థితిల్లో భారత్‌పై చెడుకన్ను వేసే సాహసం ఎవరూ చేయలేరని అన్నారు. దేశ ప్రజలందరూ ఇవాళ ప్రశాంతంగా ఇళ్లలో నిద్రిస్తున్నారంటే అందుకు మన సరిహద్దుల్లో రేయింబవళ్లు పహారా కాస్తున్న మన ఐటీబీపీ జవాన్లు, ఆర్మీనే కారణం. దుష్టపన్నాగంతో మన భూభాగంపై కన్నేసే సాహసం ఎవరూ చేయలేరు. ఈ విషయాన్ని మనం ఇవాళ చాలా గర్వంగా చెప్పుకోవచ్చు.

# దోబి ఘాటును మోతేకు మార్పు చేయాలి

### పట్టణ రజక సంఘం సభ్యులు

**జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణంలో చింతకుంటకు కేటాయించిన దోబి ఘాటును మోతే కు మార్పు చేయాలని ఎమ్మెల్యే డా. సంజయ్



కుమార్ ను ఎమ్మెల్యే క్వార్టర్లో కలిసి వినతి పత్రాన్ని అందజేసిన రజక సంఘ సభ్యులు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ధోబిఘాట్ స్థలం మోతే కు మార్పు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆవారీ శివ కేసరి బాబు, రజక సంఘం అధ్యక్షులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి

**ఎల్కతుర్తి ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలం జిలుగుల గ్రామానికి చెందిన పంజాల రాజయ్య మరణించగా, వారి కుటుంబాని, రాష్ట్ర మాజీ హౌజ్ ఫెడ్ చైర్మన్ హుస్నాబాద్ నియోజకవర్గ బీజేపి నాయకులు బొమ్మ శ్రీరాం చక్రవర్తి అండగా



ఉంటాను అని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా "బొమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో బిజెపి గొర్ల కాపర్ల విభాగం జిల్లా అధ్యక్షులు ముష్క వెంకటేష్, బూత్ అధ్యక్షులు రావుల సంపత్, ఘనబోయిన తిరుపతి, ముష్కే మహేందర్ కుమారస్వామి, కత్తుల రాజేశ్వరరావు, పల్లె భాస్కర్, రావుల యాదగిరి, వీరయ్య, మంద కనకరత్నం, వచ్చు వెంకటయ్య, రావుల ఉప్పలయ్య, బొమ్మ ఫౌండేషన్ సభ్యులు తదితులున్నారు.

## తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక కరీంనగర్ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా సొన్నాయిల భరత్

**చిగురుమామిడి ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన సోన్నాయిల భరత్ ను నియమించడం జరిగింది గత కొన్ని రోజులుగా కరీంనగర్ జిల్లా నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక లో క్రీయశీలకంగా





పనిచేస్తున్న కరీంనగర్ జిల్లాలో ఉన్న నాయీబ్రాహ్మణ సంఘా అభివృద్ధి కోసం నాయీబ్రాహ్మణుల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్నందుకు గాను ఇక నుండి వారిసేవాలను జిల్లా యువజన విభాగంలో వినియోగించు కోవాలని వారిని తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక కరీంనగర్ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా నియమించడం జరిగిందని తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు వారికి నియామక పత్రం అందించిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానల కిషన్, జిల్లా అధ్యక్షుడు జంపాల నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సింగిరాల వెంకటస్వామి, నగర కోశాధికారి శ్రీరాముల రమేష్, జిల్లా యువజన విభాగం అధ్యక్ష కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్, అదిములం మహేష్ తదితరులు ఉన్నారు.



**ఏప్రిల్ 14న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని జనగామలోని ధర్మకంచ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లి మధు ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం. పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు, సంఘ నాయకులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ప్రజా సంఘాల, కుల సంఘాల నాయకులు.**

# స్ట్రాంగ్ రూమ్ తాళాలు దొరకకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యం

**జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** స్ట్రాంగ్ రూమ్ తాళాలు దొరకడము లేదంటే ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం హైకోర్టు ఆదేశాలతో స్ట్రాంగ్ రూమ్ తెరిచారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2018 ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎన్నికల ఫలితాలు తారుమారయ్యాయని, తనకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ రికౌంటిగ్ చేయాలంటూ కోర్టును ఆశ్రయించడం జరిగింది. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లా కలెక్టర్, జిల్లా ఎలక్షన్ అధికారి సమక్షంలో ఈ.వి.ఎం. లను భద్రపరిచిన వి.ఆర్.కే. ఇంజనీరింగ్ కాలేజ్ లోని స్ట్రాంగ్ రూమ్ ను ఓపెన్ చేసి అందులోని 17ఏ,17సి డాక్యుమెంట్స్ లను, సి.సి టివి పుటేజీ మరియు ఎన్నికల ప్రొసీడింగ్స్ ను ఈ నెల 11వ తేదీన సమర్పించాలని హై కోర్టు అప్పటి రిటర్నింగ్ అధికారిగ ఉన్న బిక్షపతి ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్ట్రాంగ్ రూం తాళాలు లేకపోవడం వల్ల ఈ.వి.ఎం లను భద్ర పరిచిన స్ట్రాంగ్ రూంనీ తెరవడం జరగలేదు. ఈ సంధ్భంగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... ఒక జిల్లా కలెక్టర్ దగ్గర గానీ లేదా అడిషనల్ కలెక్టర్ దగ్గర ఉండవలసిన స్ట్రాంగ్ రూమ్ తాళాలు ఏమయ్యాయనీ, కోర్టు నుండి ఉత్తర్వులు వచ్చి ఇప్పటికీ ఆరు రోజులు గడుస్తున్న రూమ్ తాళాలు ఎవరి దగ్గర ఉన్నాయో తెలీదని,ప్రభుత్వ అధికారుల వద్ద ఉండవలసిన స్ట్రాంగ్ రూమ్ తాళాలు వారి దగ్గర లేకపోవడానికి గల కారణాన్ని ప్రభుత్వమే చెప్పాలనీ దినికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే



వహించాలనీ, స్ట్రాంగ్ రూమ్ తెరవాలని కోర్టు నుండి ఉత్తర్వులు వచ్చినప్పటికీ స్ట్రాంగ్ రూమ్ తాళాలు లేవు అని చెప్పడానికి సమాధానం మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్తారా లేదా రాష్ట్ర ముఖ్యమంత్రిగా సమాధానం చెప్తారో చెప్పాలనీ నాలుగున్నర సంవత్సరాలుగా ఒక ఎలక్షన్ పిటీషన్ మీద పోరాడుతుంటే తీరా తాళాలు లేవని చెప్పడాన్ని రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చనీ ఈ సందర్భంగా తెలిపారు.

# కన్నులపండువగా మహాలక్ష్మీ జన్మదిన వేడుకలు

**(రామ కిష్టయ్య సంగన భట్ల)**

**ధర్మపురి ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** ధర్మపురి క్షేత్రంలో వెలసిన ఆదిశక్తి, జగన్మాత, త్రిగుణాత్మక స్వరూపిణియైన శ్రీమహా లక్ష్మీ దేవి జన్మదిన వేడుకలు సోమ వారం వైభవోపేతంగా, కన్నుల పండువగా జరిగాయి. భారత దేశంలోనే సుందర వదనారవింద శోభితయైన జగన్మాత, గోదావరి తీరాన భక్తుల పాలిట కల్పవృక్షమై, కోరిన కోర్కెలను తీర్చడం జరుగు తున్నది. చైత్ర బహుళ పంచమి రోజున ప్రాచీన కాలంనుండి ఎడ్లబండ్ల తీర్థములు, రథోత్సవం నిర్వహించ బడుతూ, అశేష జన కుల, ఇల దైవమై విరాజిల్లు తున్నది. ఇటీవలే నూతన విగ్రహ ప్రతిష్ఠ గావించారు. ఈక్రమంలోనే చైత్ర బహుళ పంచమి తిథి యుక్త సోమ వారం మహాలక్ష్మి దేవి జన్మదినాన్ని పురస్కరించుకుని, దేవస్థానం వంశపారంపర్య నిర్వాహకులు కొరిడె గుండయ్య శర్మ, నరహరి శర్మ, బాల కృష్ణ శర్మ, బొజ్జా కిషన్ శర్మ ల ఆధ్వర్యంలో, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మ పురి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం పక్షాన దేవస్థానంనుండి ఊరే గింపుగా వెళ్ళి, అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. సువాసినులచే సామూహిక లక్ష్మీపూజ, కుంకుమా ర్చన, లలితా పారాయణం, ప్రత్యేక రథోత్సవ ములను, సువాసినులకు ఐదవ తనాన్ని ఒసంగుచూ, ఆర్థిక ఇబ్బందులను, మానసిక వ్యాధులను తొలగించి, అభీష్ట వరములను, ఆశ్రితుల వృత్తి, వ్యాపార, ఉద్యోగాది అభివృద్ధికై అమ్మ వారి సన్నిధిన నిర్వహించిన ప్రత్యేక జన్మదిన పూజాదులలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం పూజలు, బలి, పూర్ణాహుతి, అన్నదానాది ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఆయురారోగ్య ఐశ్వర్యదేవస్థానం నుండి గంగపుత్ర సంఘం పోస్టాఫీసు, గ్రామ పంచాయత, నంది విగ్రహం, లక్ష్మి గెనుప్రజల వద్దనుండి రథోత్సవం భక్త జనం తోడు రాగా నిర్వహించారు.

**పట్టు వస్త్రాల సమర్పణ:**

ధర్మపురి క్షేత్రంలోని గోదావరీ తీరంలో ఉన్న మహాలక్ష్మి దేవి. మందిర వార్షికోత్సవ, జన్మదిన సందర్భంగా శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం పక్షాన పట్టు వస్త్రా సమర్పించారు. ముత్యాల




తలంబ్రాలు పట్టువస్త్రాలు ప్రతి సంవత్సరము వలె ఈ సంవత్సరము కూడ ధర్మపురి దేవస్థానం పక్షాన దేవస్థానం అర్చకులకు అందజేయటం జరిగింది. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ్ శర్మ ముత్యాల శర్మ, సంతోష్ శర్మ, రాజ గోపాల్ శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసా చార్య, దేవస్థాన అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇందారపు రామయ్య, కమిటీ సభ్యులు అక్కనపల్లి సురేందర్, వేముల నరేష్ , గునిశెట్టి రవీందర్ , గందే పద్మ, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, సిబ్బంది సురేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజాదులలో పాల్గొన్నారు

# ది ఫర్టైల్ బ్రేన్స్ అంతర్జాతీయ ఆంగ్ల సాహితీ సంస్థ

- **జూమ్ సమావేశంలో మురళి**

**జనగామ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** ది ఫర్టైల్ బ్రేన్స్ అంతర్జాతీయ ఆంగ్ల సాహితీ సంస్థ ఓపెన్ థీమ్ పై జూమ్ సమావేశం సంస్థ అధినేత కె. కుమార్ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రపంచ నలుమూలలనుండి కెనడా, యుకె, యుఎస్ఏ,పాకిస్థాన్, బ్రెజిల్, ఫిలిఫ్ఫిన్స్, సింగపూర్, ఇజ్రాయిల్, ఇండియా, గ్రీకు దేశాల నుండి దాదాపు ,ముప్పై ఆరు మంది ప్రముఖ కవులు, రచయితలు పాల్గొన్నారని తెలంగాణ రాష్ట్రం నుండి చురుకుగా పాల్గొని తెలుగు, ఇంగ్లీష్ భాషలలో తనదైన శైలిలో కవితా గానం చేస్తూ తన ప్రతిభను చాటుతున్న ది ఫర్టైల్ బ్రేన్స్ కో-కన్వీనర్ రేణుకుంట్ల మురళి తెలిపారు. ఈ సమావేశంలో రిచర్డ్ స్పై సాక్, అంజీలా లాన్ఫురి, బసుదేవ్ పాల్, ప్రసన్న భట్ట, నైమ చంచౌన్, సుశాంత్ తాప,సిల్వియా యంగ్, రోని టక్కర్, డాక్టర్ గంగ లక్ష్మి పట్నాయక్, రే విటాకర్, మీనా చౌవాన్, డాక్టర్ రూపాలి సర్కార్ గౌర్, మనిటిట హచిన్ సన్, ఐజక్ కొహెన్, టాంజా అజిటిక్,అలెగ్జాంద్ర పెసరోపోలో, శ్రీధరన్ పరకోడె, లెఫ్టినెంట్ గోపాల్ పుడాని, మిలి దాస్, గుస్టావ్ సలాస్,డాక్టర్ గార్గి షాహ,మంజుల అస్థణ మహంతి, మైఖేల్ ఆంథోనీ ఇంగ్రామ్, మిల్ డ్రెడ్ ఫర్, లక్షణ్ రావ్, శ్యాం ప్రసాద్ పట్నాయక్, డాక్టర్ జనత రతీష్, డాక్టర్ సేతలూరి పద్మ, హీరా నవాజ్, అన్మేష్ మొహిట్కర్, మేరియా ఎల్వీరా, ఫెర్నాండెజ్ కొరియా తదితరులు పాల్గొన్నారు.




# ట్రస్మా టీ-శాట్ ఒలింపియాడ్ అవార్డ్ అందుకున్న ఆదిరెడ్డి

**భీమదేవరపల్లి ఏప్రిల్ 09 (ప్రజామంటలు):** తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రస్మా), ఈ-అభ్యాస్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ట్రస్మా టీ-శాట్ ఒలింపియాడ్ - 2022 అవార్డ్ ను ములుకనూర్ ఎస్ఆర్కె స్కూల్ కరస్పాండెంట్ కాశిరెడ్డి ఆదిరెడ్డి అందుకున్నారు. ఆయనతో పాటు ముల్కనూర్ న్యూ మాడల్ స్కూల్ డైరెక్టర్ చెప్యాల గోపాల్ రెడ్డి, కొత్తకొండ సిలోయం పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ అచ్చ అశోక్ అవార్డ్ అందుకున్నారు. ఆదివారం కరీంనగర్ రంగినేని గార్డెన్స్ లో జరిగిన కార్యక్రమంలో ట్రస్మాలో వివిధ సేవలు అందించిన వారికి అవార్డులు ప్రధానం చేశారు. ట్రస్మా ఆవిర్భావం నుండి మండల అధ్యక్షుడు స్థాయి నుండి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరకు అందించిన సేవలకు గాను ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కాశిరెడ్డి ఆదిరెడ్డి మాట్లాడుతూ%ా%. 2023 - 2024 విద్యా సంవత్సరం నుండి ఎస్ ఆర్ కె పాఠశాలలో ఈ - అభ్యాస్ అకాడమీ సౌజన్యంతో గ్లోబల్ ఒలంపియాడ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఇటీవలే లీడ్ కరికులంతో తెలంగాణ లీడ్ టాప్ 50 లో 32 స్థానంలో నిలవడం గర్వకారణం అని అన్నారు.



తల్లిదండ్రులు, విద్యార్థులు, అధ్యాపకుల కృషితో రాబోయే రోజుల్లో మరింత మెరుగైన విద్య అందిస్తామని అన్నారు.

# ఏప్రిల్ 11, 12, 13 తేదీలలో

## అఖిల భారత కిసాన్ సభ జెండా ఆవిష్కరణలు

**జనగామ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** అఖిల భారత కిసాన్ సభ 88వ ఆవిర్భావ దినోత్సవాలను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఏప్రిల్ 11, 12, 13 తేదీలలో గ్రామ మండల జిల్లా రాష్ట్ర స్థాయిలలో అఖిల భారత కిసాన్ సభ జెండా ఆవిష్కరణలు నిర్వహిం చాలని, కిసాన్ సభ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా జనగామ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు నాయక్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.



# గోదాల కృష్ణారెడ్డి స్మారకార్థం చలివేంద్రం ఏర్పాటు

**జనగామ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** జనగామ మండలం పెంబర్తి గ్రామంలో నేషనల్ హైవే 163 వద్ద గోదాల కృష్ణారెడ్డి స్మారకార్థం చలివేంద్రాన్ని గోదాల వంశీధర్ రెడ్డి సహకారంతో పూర్ పీపుల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. చైర్మన్ వి. జోసఫ్ బాబు, కన్వీనర్ నిర్మాల భాస్కర్ సారధ్యంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ సిహెచ్ రాజమౌళి, జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్య సిద్ధి



లింగం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వేసవి కాలం మండుతున్న ఎండల దృష్ట్యా హైవేపై వెళ్తున్న ప్రజల దాహార్తిని తీర్చడం కోసం అనేకులకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడమైనదని దాత గోదాల వంశీధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గొలుసుల ఎల్లయ్య, కంతిరి ప్రేమ్ సాగర్, శాగ శివయ్య, నిర్మాల రవి, బండ రాములు, నిడిగొండ స్వామి, సంకటి రాజు, సంకటి ఎల్లయ్య పాల్గొన్నారు.

# ప్రపంచ సాహితీ బ్రహ్మోత్సవాలలో లగిశెట్టి రాసిన నవ్య నానీలు ఆవిష్కరణ

**జనగామ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** శ్రీశ్రీ కళా వేదిక అధ్వర్యంలో తిరుపతిలో జరుగుతున్న ప్రపంచ సాహితీ బ్రహ్మోత్సవాలలో సోమవారం జనగామ జిల్లా కళావేదిక అధ్యక్షుడు,కవి లగిశెట్టి ప్రభాకర్





రచించిన "నవ్య నానీలు" పుస్తకాన్ని ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో అంతర్జాతీయ కమిటి గౌరవ అధ్యక్షుడు కింగ్ ఇంద్ర, కన్వీనర్ రమావతి, కళావేదిక తెలంగాణ అధ్యక్షురాలు కట్ల భాగ్యలక్ష్మి లు కలిసి వేదికపై ఆవిష్కరణ ఘనంగా చేశారు. ఈ సందర్భంగా లగిశెట్టి ప్రభాకర్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ నుండి కవులు, కళాకారులు చిలుమోజు సాయి కిరణ్, కిరణ్ కుమార్, మాన్యపు భుజెందర్, చాపల మహేందర్, అంకాల సోమయ్య, జోగు సుదర్శన్, జోగు సుధాకర్ చింతా ప్రసాద్ పాల్గొన్నారు.

# దళిత బహుజన సాహిత్య పురస్కారం అందుకున్న పిన్నింటి రత్నం

**జనగామ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** హైదరాబాద్ రవీంద్రభారతి లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎస్సి ఉపకులాల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్, అంబేద్కర్ జయంతి వేడుకల ఉత్సవాల సందర్బంగా జనగామ నియోజకవర్గం కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారధి కవి కళాకారుడు పిన్నింటి



రత్నం దళిత బహుజన సాహిత్య పురస్కారం అందుకున్నారు. దళిత బహుజన సాహిత్య సాంస్కృతిక రంగాలలో విశేషంగా కృషి చేస్తున్నందుకు గాను తెలంగాణ ఎస్సి ఉపకులాల రాష్ట్ర కమిటీ సంఘం ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా సాంఘీక సంక్షేమ శాఖ కొప్పుల ఈశ్వర్, ఎస్సి ఉపకులాల రాష్ట్ర అధ్యక్షులు బైరి వెంకటేష్, దళిత నాయకులు, జేభి రాజు, రాయల లక్ష్మి నర్సయ్య, గడ్డం ధనంజయ్, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తశుద్ధి లేని రాజకీయాలు!

రాజకీయాల్లో విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలి. ప్రజల సమస్యలను పక్కన పెట్టి రాజకీయ లబ్ధి కోసం పదేపదే విమర్శలు సంధించడం సరికాదు. అన్ని పార్టీలు ఈ మౌలికసూత్రం పాటించాలి. రాజకీయ నాయకుల పరస్పర విమర్శల కారణంగా ప్రజల సమస్యలకు ప్రాధాన్యం పెరగాలి. కానీ ఎన్నికలు వస్తున్న వేళ చేసుకుంటున్న విమర్శలతో ప్రజలకు లాభం లేదు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ పరేడ్ గ్రౌండ్ వేదికగా కేసీఆర్ సర్కార్‌పై మాటల తూటాలు పేల్చి సాధించేందేమీ లేకుండా పోయింది. ప్రధాన సమస్యలను ఎక్కడా ప్రస్తావించలేదు. కేసీఆర్, బీఆర్ఎస్ పేరు ప్రస్తావించ కుండానే పరోక్షంగా అవినీతి విమర్శలు చేయడం ద్వారా కేవలం రాజకీయ కోణం ఉంది తప్ప మరోటి లేదు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి.. రాష్ట్రంలోని కేసీఆర్ సర్కార్ మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనే పరిస్థితులు ఉన్నాయి. ముఖ్యంగా టీఆర్ఎస్, బీఆర్ఎస్‌గా మారిన తర్వాత బిజెపి చేస్తున్న విమర్శలకు దీటుగానే బిఆర్ఎస్ కూడా స్పందిస్తోంది. కెటిఆర్ లేఖలతో కేంద్రాన్ని కడిగి పారేస్తున్నారు. సమస్యలను నేరుగా ప్రస్తావిస్తున్నారు. ముఖ్యంగా ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కవిత ఆరో పణలు ఎదుర్కోవడం, ఇప్పటికే మూడుసార్లు విచారణకు హాజరుకావడం ఇదంతా గల్లీ నుంచి ఢిల్లీ వరకూ పెద్ద రచ్చే అయ్యింది. ఇక తెలంగాణలో జరిగిన టీఎస్‌పీఎస్సీ, టెన్త్ పేపర్ లీకేజీ వ్యవహారం.. దీనిపై ప్రతిపక్ష పార్టీలు ఆందోళనలు, నిరసనలతో అట్టుడుకుతోంది. పేపర్ లీకే జీలో మంత్రి కేటీఆర్‌కు సంబంధం ఉందని ఆరోపించిన వారందరికీ నోటీసులు ఇవ్వడం, ఆఖరికి పరువు నష్టం దావా వేయడం కూడా జరిగింది. మరో అడుగు ముందుకేసి టెన్త్ పేపర్ లీకేజీలో పాత్ర ఉందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్ట్ చేయడం రచ్చగా మారింది. ఈటెల రాజేందర్‌కు కూడా నోటీసులు ఇచ్చారు. లీకేజీలపై కేసీఆర్ అస్సలు స్పందించనే లేదు. ఈ క్రమంలో ప్రధాని మోదీ అవినీతిపరులు జైలుకేనంటూ సంకేతాలు కూడా ఇచ్చేశారు. అవినీతిపరులను శిక్షిం చాలా.. వద్దా..? మీరే చెప్పడం అంటూ ప్రజలను ప్రశ్నిం చారు. హైదరాబాద్ సభలోచేసిన విమర్శలతో కమలం పార్టీలో ఉత్సాహం నింపినా..అంతే మొత్తంలో బిఆర్ఎస్, ఇతర లెఫ్ట్ పార్టీ నేతల్లో ఆగ్రహం కూడా తెప్పించింది. బీజేపీ శ్రేణుల్లో కొత్త జోష్ వచ్చినట్లయ్యింది. కుటుంబ పాలన, తెలంగాణ ప్రభుత్వం అవినీతి పాలన ఆఖరికి దర్యాప్తు సంస్థల వరకూ అన్ని విషయాలను ప్రస్తావిస్తూ మోదీ మాట్లాడారు. ప్రధాని మోడీ హైదరాబాద్ పర్యటనలో కేసీఆర్ స్వాగతించేందుకు కానీ..సభలో పాల్గొనేందుకు కానీ రాలేదు. దీనిపై ప్రజల్లో కెసిఆర్ తీరును ఎండగట్టాలని బీజేపీ యత్నించింది. ఫరేడ్ గ్రౌండ్‌లో జరిగిన సభలో మోదీ సీటు పక్కనే కేసీఆర్ కోసం ప్రత్యేకంగా కుర్చీ వేయడం ఇవన్నీ జనాల్లోకి తీసుకెళ్లి కేంద్రం అంటే పడకపోవచ్చు కానీ కనీసం అభివృద్ధి పనులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సహకరించ ట్లేదనే భావన ప్రజల్లో కలిగించడం కోసం విశ్వ ప్రయత్నాలన్నీ చేసింది. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభ కార్యక్రమం అధికార కార్యక్రమమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంపై రాజకీయ దాడికి దిగిన మోడీ దాదాపు ఎన్నికల ప్రచార సభలా మార్చేశారు. రాష్ట్రాభివృద్ధికి, దేశాభివృద్ధికి గొప్ప కృషి జరుగుతున్నట్టు చిత్రించుకున్నారు. తర్వాత







స్వయంగా తన ప్రసంగంలోనూ అదే పాట పాడారు. దేశంలో ప్రాథమిక సదుపాయాల మెరుగుదల కోసం, రవాణా విస్తరణ కోసం కేంద్రం పరితపిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని తిట్టిపోశారు. తాను అవినీతిపై పోరాడుతుంటే కుటుంబ పాలన చేసేవారు అడ్డు తగులుతున్నారని ఆరోపణలు గుప్పించారు. పరోక్షంగా బిఆర్ఎస్ ప్రభుత్వంపై, కెసిఆర్ కుటుంబంపై కసి తీరా దాడి చేశారు.రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలసి రావడం లేదని అభాండం వేశారు. తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న రాజకీయ పరిస్థితులు ఉన్నాయి. అక్కడ జగన్ కేంద్రానికి అనుకూలంగా ఉన్నట్లు నటిస్తున్నా..అక్కడా పెద్దగా పనులు కావడం లేదు. అయితే రెండు రాష్ట్రాల్లో అధికారం అంటూ..బిజెపి మాత్రం ఏకైక లక్ష్యంతో పావులు కదుపుతున్నది. ఇక్కడి ప్రాంతీయ పార్టీల ప్రాభవాన్ని దెబ్బ తీసి తను పాదం మోపడం కోసం ఎత్తులు వేస్తోంది. తామే అధికారంలోకి వస్తామని చెబుతున్న కాంగ్రెస్ విచిత్రంగా బిఆర్ఎస్, బిజెపి ఒకటేననిఆరోపిస్తున్నది.

ఇదంతా తమ రాజకీయ ఎత్తుగడలో భాగంగా భావించాల్సిందే. కొంతమంది కాంగ్రెస్ సీనియర్లు బిజెపిని ప్రధాన ప్రత్యర్థిగా చెబుతూ బిఆర్ఎస్‌తో అవగాహన సాధ్యమేనన్నట్టు మాట్లాడుతుం టారు. తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అలాగే కాంగ్రెస్ సహా అన్ని పక్షాలు సహకరించినట్లు అయితే ...ప్రధాన ప్రచార కన్వీనర్‌గా ఖర్చులను తానే భరిస్తానని చెప్పడం ద్వారా కెసిఆర్ తన మనోగతం వెల్లడించినట్లుగా ప్రముఖ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయి చేసిన వ్యాఖ్యలు కూడా దుమారం రేపాయి. జాతీయ స్థాయిలో ఈ మధ్య చాలా సందర్భాలలో ప్రతిపక్ష కార్యాచరణలో ఈ రెండు పార్టీలూ కలసి పనిచేస్తున్నా యి. ఎ.పి ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌సిపి అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి మోడీ సర్కారుతో సత్సంబంధాలు నెరుపుతు న్నారు. ప్రధాన ప్రతిపక్ష నేత, టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కూడా బిజెపితో సత్సం బంధాలు వున్నట్టు చూపించుకోవడానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రస్తుతం ఆయనతో సన్నిహితంగా మెలుగుతున్న జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అంతకు ముందు నుంచి బిజె పితో మిత్రత్వం కొనసాగిస్తున్నారు. టిడిపి, జనసేన కూడా బిజెపితో సఖ్యత కోసం యత్నిస్తూ...రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉమ్మడి పోరాటం చేస్తున్నాయి. అయితే రాజకీయ పార్టీలు రేపటి ఎన్నికల్లో లాభం పొందేందుకు, అధికారం లోకి రావడమెలా అన్న కోణంలోనే తమవంతు రాజకీ యాలు చేస్తున్నాయి. ప్రజల సమస్యలపై ఏ ఒక్క పార్టీకి కూడా చిత్తశుద్ధి లేదని గుర్తించాలి.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## భలే దోస్తులు...

మాదారం అనే గ్రామంలో మహేష్, సురేష్ అనే స్నేహితులు ఉండే వారు. మహేష్ చాలా చురుకైన వాడు. పాఠశాల నుండి వచ్చిన తర్వాత తల్లికి చేదోడువాదోడుగా ఇంటి పనులు చేసేవాడు. తన మిత్రుడు సురేష్ మాత్రం ప్రతి పనికి బద్ధకించేవాడు. సురేష్ తండ్రి "మహేష్ ని చూసి బుద్ధి తెచ్చుకో " అనే తరచుగా మందలిస్తూ ఉండేవాడు. అయినా అతనిలో మార్పు కనిపించలేదు.

వేసవి సెలవులు కావడంతో ఒకరోజు ఇద్దరు స్నేహితులు కలిసి మహేష్ అమ్మమ్మ వాళ్ళ ఊరు బయలుదేరారు. ఆడుకోవడానికి ఊరికి







దూరంగా ఉన్న బావి దగ్గరికి వెళ్లారు. అక్కడ దొరికే ఇరికి పండ్లు, ఈత పండ్లు తాటి ముంజలు తిన్నారు. ఇలా కొన్ని దినాలు మస్తుగా ఎంజాయ్ చేశారు. వేసవి సెలవులు దగ్గర పడడంతో తమ సొంతూరుకు బయలుదేరారు.

సాయంత్రం కల్లా ఇంటికి చేరుకోవచ్చు అనుకున్నారు. కానీ సురేష్ మెల్లగా బద్ధకంగా నడిచేవాడు. ఇద్దరు కలిసి నడుచుకుంటూ వస్తుండగా చీకటి పడింది. సమీపంలోనే చిట్టడవి ఉంది. అప్పుడప్పుడు అడవి జంతు వులు ఊరు వైపు వస్తుంటాయి. ఇలా సగం దూరం రాగానే కోతులు గుంపు కనిపించింది. సురేష్ రాళ్లతో గుంపు పైకి రాళ్లు విసిరాడు.

ఆ కోతులు కిచ కిచమంటూ మీదికి రాబోయాయి. మహేష్ తన స్నేహితుడిని అలా చేయవద్దని హితవు చెప్పాడు. అడవిలో ఆహారం దొరకక ఇలా వస్తాయని చెప్పాడు. సురేష్ మాత్రం "ఈ కోతులే కాదు మనల్ని అడవి జంతువులు ఏమి చేయలేవు" అని బింకనాలు కొట్టాడు. అంతేగాక తన స్నేహితుడు మహేష్‌ను "నీవు ఎప్పుడూ అతి జాగ్రత్త పరుడవే...." అంటూ హేళన చేశాడు.

ఇలా నడుచుకుంటూ వెళుతుండగా మరి కాసేపటికి చెట్ల పొదల నుండి ఎలుగుబంటి గాండ్రింపు వినిపించింది. మహేష్ మాత్రం రాబోయే ఆపద గమనించి పక్కనే ఉన్న చెట్టు పైకి ఎక్కాడు. సురేష్ మాత్రం "ఎలుగుబంటి గిలుగుబంటి మనల్ని ఏమి చేయలేదు. రానీ చూద్దాం! " అంటూ కిందనే కూర్చున్నాడు. ఈ లోగా దూరం నుండి ఎలుగుబంటి వస్తున్న విషయాన్ని చెట్టు పైన ఉన్న మహేష్ గమనించాడు.

తన స్నేహితుడిని చెట్టు పైకి రమ్మని పిలిచాడు. సురేష్ కి చెట్టు ఎక్కడం రాదు. భయంతో సురేష్‌కి ప్రాణాలు పోయినంత పని అయ్యి వణకడం మొదలు పెట్టాడు. ఎలాగైనా తన స్నేహితుడు సురేష్‌ని కాపా డాలని అనుకున్నాడు. ఈ లోగా మహేష్‌లో ఒక ఆలోచన తట్టింది. తాను ధరించిన పాయింట్ను విడిచి చెట్టు పైనుండి కిందనున్న సురేష్ కి అందించాడు.

దాన్ని బిగ్గరగా పట్టుకున్న సురేష్ ను పైకి లాగాడు. సురేష్ చెట్టు పైకి చేరాడు. సమీపంలోకి చేరుకున్న ఎలుగుబంటి కొద్దిసేపు గాండ్రిం చింది. ఈ లోగా అదే ఊరికి వస్తున్న మనుషుల గుంపు చూసి అది అడవిలోకి పారిపోయింది. ఇద్దరు చెట్టు దిగారు. మహేష్ ను నిందిం చినందుకు క్షమాపణ కోరాడు. ఇద్దరూ కలిసి ఆ ఊరి వాళ్లతో క్షేమంగా చేరుకున్నారు.

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
9441561655

# త్రిశంకు స్వర్గంలో గల్ఫ్ కార్మికులు

## ప్రభుత్వంపైనే నిరాశా జీవుల ఆశలు

**(రామ కిష్టయ్య సంగన భట్ల)**

**ధర్మపురి ఏప్రిల్ 10 (ప్రజా మంటలు):** ప్రపంచాన్ని అతలాకుతలం గావించిన కరోనా మహమ్మారి ప్రభావం 200 పై చిలుకు దేశాలలో ఉన్నా గల్ఫ్ కార్మికుల పైన తీవ్రాతి తీవ్రంగా ఉంది. ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారి పరిస్థితి త్రిశంకు స్వర్గ తుల్యమై ఉంది. కరోనా కారణంగా ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతున్న పరిస్థితులకు, గల్ఫ్ దేశాలు మినహాయింపు లేకుండా ఉన్నాయి. ఇదివరకే కారణాంతరాల వల్ల కొన్ని దేశాలలో, వాణిజ్య పర లావాదేవీలకు అడ్డుకట్ట వేయబడి, ఆర్థిక వ్యవస్థలో, అనూహ్య మార్పులు చోటు చేసుకుంటుండగా, చెప్పా చేయక మీద పడిన కరోనా ప్రభావ కారణంగా, ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతున్నది. సదరు కారణాలవల్ల ఇప్పటికీ, అక్కడ స్థానిక ప్రభుత్వ అనుమతి కారణంగా, కొన్ని కంపెనీలు ఉద్యోగులను తీసివేయగా మరికొన్ని తమ ఉద్యోగుల జీవితాలలో 30 శాతం 50 శాతం కోతలు విధిస్తున్నాయి.

ఉద్యోగాలు పూర్తిగా కోల్పోయి స్వదేశాలకు తిరిగి రాక తప్పని స్థితులలో, భారత ప్రభుత్వానికి తమ గోడు వినిపించిన వేళ... దేశ పరిస్థితి మెరుగు పడ్డాక తగిన ఏర్పాట్లు చేసే అవకాశం ఉందంటూ, ప్రధాని మోదీ వారిని సాంత్వన పరిచి, చొరవ తీసుకొని, అక్కడి భారతీయ వ్యాపార సంస్థలతో మాట్లాడిన ఫలితంగా, ఎక్కడికక్కడే క్వరంటెన్ సెంటర్లు ఏర్పాటు చేసి, వారిని సురక్షితంగా ఉంచడం జరిగింది. స్వస్థలాలకు చెందిన స్వచ్ఛంద సేవకులు, మానవతా దృక్పథంతో, అవసరమైన వారికి భోజనాలు, ఇతర ఏర్పాట్లు చేశారు.

ఆర్థిక పరిస్థితిని చక్కబెట్టే క్రమంలో ఇప్పటికే అక్కడి ప్రభుత్వం కొన్ని బ్యాంకులకు ప్రభుత్వపరంగా నిధులు అందించడం జరిగింది. ఇదిలా ఉంటే..... గల్ఫ్ దేశాలైన సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఖతార్, ఒమాన్, బెహరాన్ ఆరు దేశాలలో ప్రస్తుతం 87 లక్షల 24 వేల 829 మంది ప్రవాస భారతీయులు ఉన్నారని పార్లమెంటులో భారత ప్రభుత్వం పక్షాన, ఒక ప్రశ్నకు సమాధానంగా, అధికారిక లెక్కలను ఇదివరకే ప్రకటించింది. వీరిలో 17 శాతం అంటే 14,90,019 మంది తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు ఉన్నట్లు ఒక అంచనా. సంక్షోభం ముదిరి పాకాన పడుతున్న వేళ.... గల్ఫ్ దేశాల లోని తెలంగాణ ప్రాంతీయులలో 25 శాతం, అంటే 3,72,503 మంది ఉద్యోగాలు దశలవారీగా కోల్పోతూ, ఆరుమాసాల వ్యవధిలో, స్వస్థలాలకు వచ్చే అవకాశం ఉన్నట్లు గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకులు మంద భీమ్ రెడ్డి సమన్వయకర్తగా, ఎమ్మిగంటి వెల్ఫేర్ ఫోరం మరియు ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్, సంయుక్తంగా జరిపిన సర్వే వల్ల స్పష్టం అయింది.

ఒక గల్ఫ్ కార్మికుడు సరాసరి దాదాపు 700 ధరంస్ / రియాల్స్ అంటే 14 వేల రూపాయలను నెలనెలా ఇంటికి పంపిస్తున్నారని అనుకుంటే, 3.70 లక్షల మంది సంవత్సరానికి 6, 250 కోట్ల సంపాదన కోల్పోతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. దీని ప్రభావం తెలంగాణ ప్రభుత్వం పైనా తీవ్రంగా ఉంటున్నది.. వాస్తవానికి అరబ్ గల్ఫ్ దేశాలు... సౌదీ, యూఏఈ, ఒమాన్, బెహరాన్, కువైట్, ఖతార్ తదితర దేశాలలో తెలంగాణ కార్మికులు, జీవనోపాధి కోసం వలస వెళ్లగా, వారిపై ఆధారపడిన కుటుంబాలలో దాదాపు 40 లక్షలకు పైగా ఓటర్లు, 25 శాసనసభ నియోజక వర్గాలకు చెందిన వారు ఉన్నారు. బొంబాయి - దుబాయ్ బొగ్గుబాయి... నినాదంతో తెలంగాణ - వలస కార్మికుల స్థితి గతుల గురించి, ఉద్యమ సమయంలో పదేపదే వల్లించిన తెరాస నేతలు, అధికారంలోకి వచ్చాక, ఆ విషయమే మరిచారు. తెలంగాణ తొలి తెరాస ప్రభుత్వం 2018 - 19 ఆర్థిక సంవత్సరానికి, ఒత్తిళ్ల అనంతరం 100



కోట్లు కేటాయించినా, సదరు నిధులను ఖర్చు చేయని అంశాన్ని, కార్మికుల కుటుంబాలు ప్రతిపక్షాలు పదేపదే గుర్తు చేస్తూనే ఉన్నాయి.

తెలంగాణ కార్మికులు ప్రతినెల పదిహేను వందల కోట్లు విదేశీ మారక ద్రవ్యాన్ని, మాతృ దేశానికి పంపిస్తూ, దేశ, రాష్ట్ర అభివృద్ధికి చేయూతను, అందిస్తు ఉన్నట్లు విశ్లేషకులు పదే పదే చెబుతూనే ఉన్నారు. గల్ఫ్ ఎన్.ఆర్.ఐ ల ద్వారా 18000 కోట్ల ధనం తెలంగాణకు వస్తుండగా పరోక్షంగా. ఐదు/ఆరు శాతం స్థానిక పన్నుల రూపే ణ ఏటా 1000 కోట్ల ఆదాయం పొందడం జరుగు తున్నది. తెరాస ఇటీవలి, మలి సాధారణ శాసనసభ ఎన్నికలలో, తమ వాగ్దానంగా, గెలిచాక గల్ఫ్ కార్మికులకు న్యాయం చేస్తామని ప్రకటించింది. గల్ఫ్ లో రాచరిక పాలన నేపథ్యంలో, రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడం నిషేధం. అందుకే గల్ఫ్ కార్మికుల సమస్యల అట్ల అక్కడ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించే వేయలేదు. ఆర్థిక మాంద్యం, ఉద్యోగాల స్థానీకరణ, కంపెనీల దివాలాలు, ఇరాక్, లిబియా, యెమెన్ లాంటి దేశాలలో ఆధిపత్య పోరు, అంతర్గత ఉద్య మాలు, యుద్ధ వాతావరణం కలగలిపిన నేపథ్యంలో, తెలంగాణ ప్రాంతీయులకు, ఉద్యోగ భద్రత పూర్తిగా కరువైంది. గల్ఫ్ దేశాల నుండి విధిలేని పరిస్థితు లలో, ఉపాధి కోల్పోయి, తిరిగి రానున్న కార్మి కులకు, తెలంగాణ ప్రభుత్వం పునరావాసం, పునరేకీ కరణ, (రీ ఇంటిగ్రేషన్, రీ సెటిల్మెంట్, రిహ్యాబిలి టేషన్) పథకాలను ఏర్పరచి, కేరళ ప్రభుత్వ తరహాలో, ప్రత్యేక విభాగాన్ని, గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు, ఏర్పాటు చేయాలని, ఇతర దేశాలలో అనుభవం గడించి వచ్చిన, నైపుణ్యం, సా ర్థ్యం కలిగిన కార్మికుల సేవలు వినియోగించు కోవాలని, ఎమ్మిగ్రెంట్స్ వెగ్నెక్ ఫోరం అధ్యక్షులు మంద భీం రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# పీడిత జన బాంధవుడు జ్యోతిరావు పూలే

## ఏప్రిల్ 11... మహాత్మా పూలే జయంతి

భారత జాతిపిత మోహన్ దాస్ గాంధీ కన్నా ముందే "మహా త్మునిగా""" భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ చే, """గురువుగా" భావింప బడి, ప్రకటింప బడి, జన నీరాజనాలు అందుకున్న జ్యోతిరావు పూలే భారత ప్రప్రథమ సామాజిక తత్వవేత్త. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, అణచివేతకు గురవుతున్న ప్రజలకు ఆత్మస్థైర్యం అందించేందుకు, వారి హక్కుల కోసం, నిరంతరం అననుకూల పరిస్థితులలో పోరాటాలు చేసి సత్య ధర్మ శోధక మండలిని స్థాపించి, పలు సమస్యల పరిష్కారానికి కృషిచేసిన మహనీయుడు పూలే. సామాజిక తత్వవేత్తగా, ఉద్యమకారునిగా, సంస్కరణవాదిగా, సాంఘిక సేవా తత్పరునిగా, బాలికా విద్య ప్రోత్సాహకునిగా, మహిళా హక్కుల పరిరక్షకునిగా, కార్మిక పక్షపాతిగా, దీన జన బాంధవునిగా, లింగ వివక్షకు వ్యతిరేకిగా అణగదొక్కబడిన వర్గాల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారు పూలే. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్ర ( బ్రిటిష్ ఇండియా)లో జన్మించిన పూలే. తండ్రి గోవిందరావు పీష్వాల కాలంలో పూల వ్యాపారం చేయడం వల్ల వారికి పూలే అని పేరు వచ్చింది. చిన్నతనంలో చదువు మానేసి, తిరిగి పుణేలో 1941లో క్రైస్తవ ముస్లిం మిత్రుల సహకారంతో , స్కాటిష్ మిషన్ లో చేరి విద్యాభ్యాసం కొనసాగించారు.



పుస్తకపఠనం పై మక్కువ ఎక్కువ చూపారు. చదువుకునే సమయాన 1948లో బ్రాహ్మణ స్నేహితుని వివాహానికి హాజరైన సందర్భంగా బిసి "మాలి" కులానికి చెందిన పూలే కుల వివక్ష కు లోనై తీవ్ర మానసిక వ్యధ చెందారు. సదాశివ బిల్లాల్ గోవింద్ అనే బ్రాహ్మణ మిత్ర పరిచయం, సాన్నిహిత్యం, "థా మస్" రచన మానవ హక్కుల ప్రభావం, ఆయనపై ఎంతగానో ప్రభావం చూపింది. కులం, వర్గం, ప్రాంతం, లింగాది, వివక్షతలకు అవిద్యే కారణమని భావించి, తన భార్య సావిత్రిని బడికి పంపా రాయన. 1848 ఆగస్టులో బాలికల పాఠశాలను 51ు52 లో మరో రెండు పాఠశాలలను ఆదర్శ దంపతులు స్థాపించారు. 1853లో దేశంలోనే మొదటిదిగా పూలే వితంతువుల అనాథ శిశువుల కోసం సేవా సదనం స్థాపించారు. శ్రామిక ప్రజల కోసం 1855లో 'రాత్రి బడి'ని స్థాపించారు. 1864లో "బాలహత్య ప్రతిబంధక్ గృహ" గర్భస్రావ వ్యతిరేక కేంద్రాన్ని స్థాపించి, వితంతువులెట్కన గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచారు. 1868లో తన ఇంటి దగ్గరున్న స్నానాల తొట్టి వద్ద స్నానం చేసేందుకు అంటరాని వారికి కూడా అనుమతి ఇచ్చారు. బాల హత్య ప్రతిబంధక్ గృహలో జన్మించిన బ్రాహ్మణ వితంతు కుమారున్ని 1872 లో దత్తత స్వీకరించారు. తాను అనుభవించిన కుల వివక్ష ఇతరులకు అనుభవానికి రాకూడదని ఆకాంక్షించారు. సహ ధర్మ చారిణి సావిత్రితో కలిసి 40 ఏళ్ల పాటు నిర్వహించిన సామాజిక ఉద్యమాలు, పూలే దంపతులకు పేద జనోద్ధారకులుగా సమాజంలో గుర్తింపు తెచ్చాయి. ఎక్కడ అన్యాయం, వివక్ష చోటు చేసుకుంటే, అక్కడ ఉద్యమం నడిపారు.

అణగారిన వర్గాలకే కాదు, బాధితులైన అగ్రకుల వితంతు పునర్వివాహాలకు విశేష కృషి సలిపారు. బ్రాహ్మణ వితంతువులకు శిరో ముండనాలు చేయమని క్షురకులచే సమ్మెలు చేయించారు. 1871 లో సత్యశోధన పక్షాన దీనబంధు పత్రిక నడిపాడు. సహపంక్తి భోజనానికి సంసిద్ధత ప్రకటించారు. 1873 సెప్టెంబరు 24న సత్య శోధక సమాజాన్ని పూలే స్థాపించాడు. దేశంలోనే ఇది మొట్టమొదటి సంస్కరణోద్యమం. బొంబాయి నిర్మాణానికి తెలంగాణ నుండి వలస వెళ్ళి ఎదిగిన మున్నూరుకాపులే అధికం. బొంబాయిలో సత్యశోధక్ సమాజ్ శాఖ పుట్టింది సయాజీ నాగు మున్నూరుకాపు ఇంటిలోనే. పూలే సామాజిక సంస్కరణోద్యమానికి తుదిశ్వాస వరకు చేదోడు వాదోడై నిలిచిన జాయా కారాడీ లింగు తెలంగాణం కన్న మున్నూరు కాపు బిడ్డ. కారాడి లింగు తండ్రి జాయా ఎల్లప్పలింగు ముంబైలో భవన నిర్మాణ కాంట్రాక్టరు. పూలే కొంతకాలం భవన నిర్మాణ కాంట్రాక్టరుగా పనిచేశారు. అప్పుడే ఆయనకు ముంబై తెలుగు ప్రజల పితామహునిగా ప్రసిద్ధులైన కాంట్రాక్టరు రామయ్య వెంకయ్య అయ్యవారితో పరిచయమైంది. వెంకయ్య పూలేను ముంబైకి ఆహ్వానించి, తోటి కాంట్రాక్టర్లతో కలిసి సత్యశోధక సమాజాన్ని విస్తరింప జేయడానికి, పాఠశాలలను ఏర్పాటుచేసి నడపడానికి ఆర్థిక, హార్థిక సహాయాలను అందించారు. సత్యశోధక సమాజానికి తెలుగువారి విరాళాలే ప్రధాన ఆర్థిక వనరుగా ఉండేవి. వెంకయ్య ఇల్లే అనాథ బాలల ఆశ్రమంగా ఉండేది. వారిని గొప్ప విద్యా వంతులుగా, సత్యశోధకులుగా చేసిన ఘనత వెంకయ్యదే. పూలే ప్రసిద్ధ గ్రంథం "గులాంగిరి" పుస్తక ప్రచురణ 1873లో వెంకయ్యనే ప్రచురించారు.

1882లో హంటర్ కమిషన్‌కు' శూద్రాతి శూద్రులకు చదువు చెప్పించాల్సిన అవసరం ఉందని నివేదికలిచ్చి, అస్పృశ్యుల కోసం బ్రిటిష్ వారిచే పాఠశాలల్ని ఏర్పాటు చేయించారు. 83 లో కల్టివేటర్ విప్ కార్డ్ ( సేద్య గాడిపై చర్నాకోల) ముప్పై మూడు వ్యాసాల పుస్తకాన్ని సార్వజనిక సత్య ధర్మ పేరున ప్రచురించారు.

బ్రాహ్మణేతరులచే జరిపించిన కులాంతర వివాహాలు చెల్లవని బ్రాహ్మణులు తీర్మానాలు చేస్తే, సత్యశోధన మండలి ద్వారా కోర్టుకు వెళ్లారు. 1990లో కోర్టు పూలే వాదనను సమర్థించింది. తద్వారా పూలే అమితానందం చెందారు. ఆయన వ్రాసిన 33 ఆర్టికల్స్ గల "సార్వజనిక్ సత్యధర్మ" పుస్తకంలో కుటుంబ సృష్టి నియమాల గురించి వివరిస్తూ ప్రపంచం మొత్తాన్ని ఒక కుటుంబంగా వ్యక్తీకరించారు. సామాజిక ప్రజాస్వామ్యం సాధిం చటం భారత దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ పూలే తన గురువు అని డా బి.ఆర్. అంబేద్కర్ ప్రకటించారు. పూలేకు కేవలం కుల వ్యవస్థ వ్యతిరేకతే కాదు, సామ్రాజ్యవాద వ్యతిరేకత, కార్మికవర్గ, రైతాంగ పక్షంగా పోరాడే అవగాహన, కార్యాచరణ ఉన్నాయి. అనారోగ్యానికి గురై పడకకే పరిమితం అయిన సమయాన, తాను మృతి చెందాక, ఎవరు ఏ బాధ్యతలు స్వీకరించాలో వివరించి సామాజిక ఉద్యమాలు, విస్తరింపచేసి, ప్రగతి మార్గంలో ప్రజలను తీసుకెళ్లాలని నొక్కి చెప్పి, తన ఆదర్శాలను కొనసాగించాలని హితవు పలికి 63వ ఏట 1890 నవంబర్ 28న గురువారం రాత్రి ప్రార్థనా గీతాల మధ్య దీర్ఘ నిద్రకు మహాత్మ పూలే ఉపక్రమించారు. భారతావనిలో గొప్ప సాంఘిక సంస్కర్తగా ఆచంద్ర తారార్కం మహాత్మ పూలే మిగిలి పోనున్నారు.



-ఆర్కె సంగనభట్ల
9440595494

# మొక్కజొన్నకు మద్దతు ధర కల్పించాలి

ప్రైవేట్ వ్యాపారులు మొక్కజొన్న ధరను రోజురోజుకూ తగ్గించడానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు పెట్టకపోవటమే కారణమని, రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు అన్నారు. ప్రభుత్వం మొక్కజొన్నను కొనుగోలు చేస్తే ,ప్రైవేట్ వ్యాపారులు ధరలు తగ్గించే వారు కాదని, ప్రభుత్వం కొనుగోలు చేసే ఆలోచన చేయటం లేదని అన్నారు. ప్రైవేట్ వ్యాపారులు రైతుల అవసరాలను, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఇంకా ధర తగ్గించే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, కొనుగోలు వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.నిన్న మొన్నటి వరకు ఆశాజనకంగా ఉన్న మొక్కజొన్న ధర, గత పది రోజుల నుండి రోజురోజుకు తగ్గిపోతుంది. ప్రభుత్వ ధర కన్నా, ప్రైవేటు వ్యాపారుల ధర బాగుందని రైతులు ఆశిస్తున్న నేపథ్యంలో, ధరలు తగ్గిపోవటం రైతాంగాన్ని నిరాశకు గురిచేస్తుంది. మొదట్లో ఆశాజనకంగా ఉన్న మొక్కజొన్న ధర, రోజురోజుకూ పతనం అవ్వటం పట్ల వ్యాపారుల సిండికేట్ ప్రభావం ఉందని, పలువురు మొక్కజొన్న రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సంవత్సరం రబీలో మొక్కజొన్న పైరును పంగులూరు మండలంలో 4,600 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. వాతావరణం అనుకూలించటం వలన ప్రారంభం నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పైరు బాగానే ఉంది. ఎలాంటి చీడపీడలు కూడా ఆశించకపోవడంతో ఈ సంవత్సరం దిగుబడులు బాగానే ఉంటాయని రైతులు భావించారు. ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్లు వరకు దిగుబడులు వస్తున్నాయి. నెల రోజులు ముందు ప్రైవేటు ధర కూడా బాగా ఉంది. ప్రభుత్వ ధర 1,960 రూపాయలు కాగా, ప్రైవేట్ వ్యాపారుల ధర రూ.2,200 వరకు ఉంది. దీంతో మొక్కజొన్న రైతులు మంచి లాభాలు వస్తాయని ఆశించారు. గత 20 రోజులు నుంచి మొక్కజొన్న పండి రైతుల ఇళ్లకు చేరుకోవడంతో మొక్కజొన్న ధర పతనం ప్రారంభమైంది. రోజురోజుకూ ధర తగ్గుతూ ప్రస్తుతం 1,960



రూపాయలకు చేరింది. రాబోయే రోజుల్లో ఇంకా ధర తగ్గే అవకాశం ఉందని పలువురు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ధర ఎంత ఉందో, ప్రైవేట్ ధర కూడా అంతే ఉంది. మొక్కజొన్న ఒక్కసారిగా రైతుల ఇళ్లకు చేరటం, రైతులు వ్యాపారుల చుట్టూ తిరగటం వలన వ్యాపారులు సిండికేట్ అయి, ధరలు తగ్గించడం ప్రారంభించారని రైతులు చెబుతున్నారు. రానున్న పది రోజుల్లో కూడా మిగిలిన మొక్కజొన్న రైతులు వద్దకు చేరే అవకాశం ఉందని, దీన్ని ఆసరాగా తీసుకొని ఇంకా ధర తగ్గించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ సంవత్సరం మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉందని, రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులుగా పెట్టారు. కౌలు ధరలు కూడా ఎక్కువగా పెట్టి మొక్కజొన్నలు సాగు చేశారు. అయితే ధరలు తగ్గిపోవడం రైతాంగాన్ని, కౌలు రైతాంగాన్ని నష్టాలు పాలు చేసే విధంగా ఉన్నాయని పలువురు చెబుతున్నారు.

# హోటళ్లలో మంచినీరు సరఫరా చేయాల్సిందే

### రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు

**హైదరాబాద్,ఏప్రిల్10(ప్రజా మంటలు) :** గ్రేటర్ హైదరాబాద్లోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, వీధి వ్యాపారులు తప్పని సరిగా జలమండలి సరఫరా చేసే తాగు నీటిని గానీ, ఆర్ఓ వాటర్, శుద్ధి చేసిన నీటిని గానీ తప్పని సరిగా ఉచితంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ



ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఆదేశించారు.ఈ మేరకు తగు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్కు ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ, హోటళ్లు, రెస్టారెంట్లలో తప్పనిసరి పరిస్థితుల్లో వాటర్ బాటిల్స్ సరఫరా చేస్తే ఆయా బాటిల్స్పై ముద్రించిన గరిష్ట ధరను మాత్రమే వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలోని అనేక హోటళ్లు, రెస్టారెంట్లలో వేర్వేరు బ్రాండ్ల పేరుతో బాటిల్ వాటర్ను అత్యధిక ధరకు విక్రయిస్తున్నారని ఒక స్వచ్ఛంద సంస్థ చేసిన ఫిర్యాదు మేరకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్పందించారు.

# తెలంగాణ పెండింగ్ బిల్లుల కేసు

### కేసును రెండు వారాలపాటు వాయిదా వేసిన సుప్రీం

**న్యూఢిల్లీ,ఏప్రిల్10(ప్రజా మంటలు):** తెలంగాణ పెండింగ్ బిల్లుల ఆమోదం పిటిషన్పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. రాష్ట్ర గవర్నర్ తమిళిసైవద్ద ఉన్న పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. చట్ట సభలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదముద్ర వేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్ దాఖలైంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ప్రతివాదులుగా గవర్నర్ కార్యదర్శి, కేంద్ర న్యాయశాఖ కార్యదర్శిని చేర్చుతూ తెలంగాణ సర్కార్ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్పై సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై




చంద్రచూడ్ ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. దీంతో పిటిషన్ను రెండు వారాల పాటు వాయిదా వేస్తున్నట్లు సుప్రీం కోర్టు ధర్మాసనం నిర్ణయించింది. అయితే నేడు సుప్రీంకోర్టులో తెలంగాణ పెండింగ్ బిల్లులపై విచారణ జరుగనుండగా గవర్నర్ అనూహ్య రీతిలో నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం పంపిన బిల్లుల్లో మూడు బిల్లులకు తమిళిసై ఆమోద ముద్ర వేశారు. అలాగే రెండు బిల్లులను వెనక్కి పంపగా.. రెండు బిల్లులను రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. మరో 3 బిల్లులను గవర్నర్ తమిళిసై పెండింగ్లో పెట్టారు. అయితే తాము ఎన్నో రకాల ఉద్దేశాలు, లక్ష్యాలతో బిల్లులను ఆమోదించి పంపితే గవర్నర్ ఆమోదించకుండా నెలల తరబడి పెండింగ్లో పెడుతున్నారని ప్రభుత్వ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అయితే, బిల్లుల్లో స్పష్టత కొరవడిందని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వడం లేదని, అందుకే పెండింగ్లో పెట్టాల్సి వస్తోందని రాజ్భవన్ వర్గాలు ఇన్నాళ్లూ చెప్పుకొచ్చాయి. గత సెప్టెంబరులో జరిగిన శాసన సభ సమావేశాల్లో ప్రభుత్వం ఎనిమిది బిల్లులను ఆమోదించి, అదే నెల 13న గవర్నర్ తమిళిసైకి పంపించింది. వాటిలో జీఎస్టీ బిల్లును మాత్రమే గవర్నర్ ఆమోదించారు. తాజాగా ఈరోజు మరో మూడు బిల్లులకు ఆమోద ముద్ర వేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు.

# గవర్నర్ బిల్లులు ఆపడంలో కుట్ర

### కోర్టుకు వెళితే తప్ప సంతకాలు కాలేదు

### కేంద్రం తీరుపై మండిపడ్డ హరీష్ రావు

**సిద్దిపేట,ఏప్రిల్10(ప్రజా మంటలు) :** రాష్ట్ర శాసనసభ పాస్ చేసిన బిల్లులను ఆమోదించకుండా ఏడు నెలలుగా గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ ఆపారని మంత్రి హరీశ్రావు తెలిపారు. కోర్టులకు వెళ్లి కేసులు వేస్తే తప్ప బిల్లులు పాస్ కానీ పరిస్థితి ఏర్పడిందని గవర్నర్పై మంత్రి మండిపడ్డారు. సుప్రీంకోర్టులో కేసు వేస్తే ఇవాళ రెండు మూడు బిల్లులు పాస్ చేశారు. బీజేపీ కుట్రలు చేస్తూ రాష్ట్ర ప్రగతిని ఎంతగా అడ్డుకుంటుందో గమనించాలన్నారు. ఫారెస్టు యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన



బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ పంపారు. ఇది రాష్ట్ర ప్రగతిని అడ్డుకోవడం కాదా? అని ప్రశ్నించారు. కామన్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా ఉద్యోగాలు ఇస్తామంటే, ఆ బిల్లును ఏడునెలల పాటు ఆపి ఇప్పుడు రాష్ట్రపతి పరిశీలనకు పంపారు. మా పిల్లలకు ప్రొఫెసర్లు చదువులు చెప్పొద్దా? అని నిలదీశారు. బీహార్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో అన్ని యూనివర్సిటీలకు కామన్ రిక్రూట్మెంట్ బోర్డును 1961 నుంచే అమలు చేస్తున్నారు. గవర్నర్ తీరు సబబేనా? ఎక్కడి నుంచి ఆదేశాలు వస్తే రాష్ట్రాన్ని ఇబ్బంది పెడుతున్నారని ప్రశ్నించారు. దీని వెనుక రాజకీయం ఏంటి అనేది అందరికి తెలుసన్నారు. గవర్నర్ చర్యలను తెలంగాణ సమాజం అసహ్యించుకుంటుందని మంత్రి ధ్వజమెత్తారు. సరైన సమయంలో కేంద్రానికి తెలంగాణ సమాజం గుణపాఠం చెబుతుందన్నారు.

# మహాత్మ జ్యోతి రావ్ పూలే ఉత్సవ కమిటీ జిల్లా కన్వీనర్గా బోగోజీ ముకేశ్ ఖన్నా



**జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజా మంటలు) :** మహాత్మ జ్యోతి రావ్ పూలే ఉత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ గా బోగోజీ. ముకేశ్ ఖన్నాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీ సమస్యల మీద పోరాటం చేసే నాయకుడుగా గుర్తింపు పొందిన ముకేశ్ ఖన్నా పూలే ఉత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ కావడం పట్ల బీసీ నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# హిందూ మతం పట్ల ఇతర మతాల భిన్నాభిప్రాయాలు

(నిన్నటి సంచిక తరువాయి)

భూస్వామ్యవర్గంలో అగ్రకులాలు, అగ్రవర్ణాలు ఉన్నాయి. వీరు పన్నులకోసం భూమిని కొంత ప్రాంతాన్ని, కొన్ని గ్రామాలను అప్పగించినప్పుడు అవి వారి వ్యక్తిగత ఆస్థిగా మార్చుకున్నారు. భారత రాజ్యాంగం ఆ భూములనుండి వీరిని తొలగించలేదు. ఆస్థిహక్కు కింద ఆ భూములను భూస్వామ్యవర్గాలు కాపాడుకున్నారు. ఇలా జరుగుతుందని డా॥ బి.ఆర్. అంబేద్కర్ భూ కమతాల గురించి, వాటి రద్దు చేయాల్సిన అవసరం గురించి నొక్కి చెప్పారు. భూమిమీద అధికారం భూస్వాములది, అగ్రవర్ణాలది. దాని బాదితులు శూద్రులు, అతిశూద్రులే. స్వాతంత్ర్యానంతరం తర్వాత ప్రజలు ఉద్యమించినప్పుడు దున్నేవారికే భూమి అని ముందుకు కదలబారినప్పుడు ఆయా రాష్ట్రాల్లో అనేక భూసంస్కరణ చట్టాలు చేయబడ్డాయి. న్యాయస్థానాలు ఆ చట్టాలకు వ్యతిరేకంగా తీర్పునిచ్చాయి. దాంతో జనతా పార్టీ ఆస్థి కలిగి ఉండడం రాజ్యాంగబద్ధ ప్రాథమిక హక్కు కాకుండా, చట్టపరమైన హక్కుగా మార్చింది. భూసంస్కరణలకోసం చేసిన చట్టాలను న్యాయస్థానాల పరిధినుంచి తప్పించడానికి వాటన్నిటిని 9వ షెడ్యూల్లో చేర్చాల్సి వచ్చింది. ప్రజలకు, ప్రజా ఉద్యమాలకు వ్యతిరేకంగా, భూస్వామ్య వర్గాలకు అనుకూలంగా న్యాయవ్యవస్థ కొనసాగుతూ వస్తున్నది. స్వాతంత్ర్యానికి పూర్వం ఇంకా ఎంతో బలంగా వారు ఉన్నారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

**15. హిందూ మతం పట్ల ఇతర మతాల భిన్నాభిప్రాయాలు**

ఇతర మతాల వ్యాప్తికోసం పనిచేసేవారిచేత భారతీయ ప్రజల మెదళ్లలో నాటబడ్డ బ్రాహ్మణ వ్యతిరేక సిద్ధాంతం అర్థం చేసుకోవడానికి సంస్కృతిలోకి వెళ్లి పరిశీలించవచ్చు. భారతీయ సంస్కృతిలోని నూటికి తొంబై అంశాలు బౌద్ధం, మాతృస్వామిక వ్యవస్థ నెలకొల్పినవి. పితృస్వామిక వ్యవస్థ, భూస్వామ్య వ్యవస్థ, బ్రాహ్మణీయ వ్యవస్థ, వర్ణ కుల వ్యవస్థ నెలకొల్పిన ఆధిపత్యాలు, దోపిడీ సంస్కృతి మానవీయ సంస్కృతిమీద రుద్దబడ్డాయి. సామాజిక స్వామ్యవాదం, ఈ ఆధిపత్యవాదాలు రెండూ జీవితంలో పరస్పరం నిత్యం సంఘర్షిస్తున్నాయి. వేల యేళ్ళుగా భారతదేశంలోని రాజులు, రాజ్యాలు, చక్రవర్తులు, శూద్రులు, ఇతర మతాలవారే. ఎప్పుడో కొద్దికాలం బ్రాహ్మణులు రాజ్యాలు ఏలారు. ఈ విషయాన్ని జ్యోతిరావు పూలే, అంబేద్కర్ల కోణంలో 'భారతీయ చరిత్ర శూద్ర దృక్పథం' అనే గ్రంథంలో సోదాహరణంగా వివరించడం జరిగింది.

**16. పరస్పర అంగీకారంతో సాధించిన విజయాలే భారత రాజ్యాంగం**

పరస్పరం అంగీకారంతో సాధించిన విజయాలే భారత రాజ్యాంగం. అందులో వాయిస్ గ్రూపుగా ఉన్నవారు, అందులో లేనివారిని కూడా పట్టించుకున్నారు. మహిళలు, బాలలు లేకపోయినప్పటికీ వారి గురించి పట్టించుకున్నారు. ఓబీసీలు బలమైన వాయిస్ ఇవ్వగలిగినవారు ఎవరూ లేకపోయినప్పటికీ అనేక ఆర్టికల్స్ను చేర్చి రక్షణను కల్పించారు. తర్వాత తీసుకోవాల్సిన చర్చల కోసం అవకాశమిచ్చారు. చర్యలకోసం, చట్టాలకోసం అవకాశాలిచ్చారు. అందరిని ఒప్పించిన రాజ్యాంగం



అన్నింటికన్నా గొప్పది. ఆచరణలో ఉన్నది.

**17. మాతృస్వామిక సంస్కృతి రూపాలు**

పితృస్వామిక వ్యవస్థలకు సమాంతరంగా, మాతృస్వామిక సంస్కృతి అనేక రూపాల్లో సమాంతరంగా కొనసాగుతూనే వచ్చింది. మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే, పపుల్ జయకర్ (మదర్ గాడెస్సెస్), డా॥ కత్తి పద్మారావు (పితృస్వామిక వ్యవస్థలో స్త్రీ), కంచె ఐలయ్య (వై అయామ్ నాట్ హిందూ) వంటి ఎందరో వీటిని వెలికితీసి చెప్పారు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ పితృస్వామిక అణచివేతను, కుల వ్యవస్థ అణచివేతను రెంటినీ తన మొదటి సిద్ధాంత వ్యాసంలోనే పేర్కొన్నాడు.

భారతదేశంలో కులాలు అనే మొదటి సిద్ధాంత వ్యాసమే. మొత్తం రచనలన్నింటిలో భావదారలో, రాజకీయాల్లో విస్తరించింది. ఎలాగైతే మార్క్స్, ఎంగెల్స్లు, కమ్యూనిస్టు మ్యానిఫెస్టోయే మిగతా అన్ని రచనలకు విస్తరించిందో అలాగే భారతదేశంలో కులాలు అనే . సిద్ధాంత ప్రతిపాదనలే అంబేద్కర్ అన్ని రచనల్లోకి విస్తరించింది.

**18. జాతీయ ఉద్యమ కాలం - కులసమస్య**

హిందూ మతంలోని వర్ణ, కుల వ్యవస్థలను, స్త్రీల అణచివేతలను స్థిరపరిచే సంస్కృతిని, ఆర్థిక దోపిడీని, అవమానాలను, ఆత్మన్యూనతను, పితృస్వామిక వ్యవస్థను, మహిళల అణచివేతపై నిలబడిన, స్థిరపడిన హిందూ సంస్కృతిని, అసమానతలను, ఆర్థిక దోపిడీని నిర్మూలించాలనిగానీ, పరిశీలించాలని గానీ, పరిష్కరించి, సమానత్వం దిశగా సమాజాన్ని ఆధునీకరించాలనిగానీ హిందూ మత జాతీయవాదులైన గాంధీ, నెహ్రూ, బాబూ రాజేంద్రప్రసాద్, బాలగంగాధర్ తిలక్, వల్లభాయ్ పటేల్ అనుకోలేదు. పైగా చాలా సందర్భాల్లో హిందూ సంస్కృతి గొప్పది అంటూ విప్లవాత్మక సంస్కరణలను వ్యతిరేకించారు. స్త్రీలకు సమాన హక్కులకోసం, ఓబీసీలకు సమాన హక్కుల కోసం డా॥ బి.ఆర్. అంబేద్కర్ చేసే ప్రతి ప్రయత్నానికి అడ్డు తగిలారు. చివరకు న్యాయశాఖామంత్రిగా ఉన్న డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఈ రెండు సాధించలేకపోతున్నందున రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. మొదటినుంచి డా॥ బి.ఆర్. అంబేద్కర్ 'బ్రాహ్మణిజం-క్యాపిటలిజం' ఈ దేశానికి, ప్రజలకు ప్రధాన శత్రువులు అని విస్పష్టంగా పేర్కొన్నారు. కాగా బ్రహ్మసమాజం, ఆర్యసమాజం, హిందూ మత సంస్కరణలకు పూనుకొని సంస్కృతీకరణకు పరిమితమయ్యాయి. శూద్రులు, ఓబీసీలు వీటిపట్ల ఆకర్షితులై హిందూమతం పరిధిలోనే ఉండిపోయారు. రాజకీయ అధికారం కోసం సంఘటిత వర్గంగా ముందుకు రాలేకపోయారు. కాంగ్రెస్, తదితర సంస్థల్లో అనుబంధ సంఘాలుగా కొనసాగుతూ వచ్చారు. నిజామాంధ్ర మహాసభలో చేనేత కులాలవారు, మహిళలు అనుబంధ సంఘాలుగా కొనసాగుతూ వారి డిమాండ్లపై తీర్మానాలను సాధించుకున్నారు. 1917 నుండి 1934 దాకా శూద్రులైన ఓబీసీలు రాజకీయ హక్కుల విషయంలో ఇగ్నోర్ చేయబడ్డారు. కుల సంఘాలకు, కులవృత్తి సంఘాలకు, కులవృత్తి రక్షణలకు, ఆకలి పోరాటానికి పరిమితమయ్యారు. గాంధీజీ హామీలు వారిని ఆకర్షించాయి. కాంగ్రెస్, గాంధీ ఓబీసీలను ఒక పథకం ప్రకారం మభ్యపెడుతూ, వంచిస్తూ వచ్చారు.

**19. అంబేద్కర్ తాత్విక వారసత్వం**

బుద్ధుడు, కబీర్దాస్, గురు రవిదాస్, మహాత్మా జ్యోతిభా పూలే, పెరియార్ రామస్వామి నాయకర్, నారాయణగురు, హయతీదాస్, సంత్ గాడ్గే బాబా మొదలైన మహనీయుల స్ఫూర్తిని అంబేద్కర్, అంబేద్కరిజం తనవెంట ముందుకు తీసుకువెళ్తూనే ఉంటుంది. ఇలా ఒక సమగ్రతలో అంబేద్కర్ను చూడాలి. భారత రాజ్యాంగంలో పొందుపరుచుకున్న ఓబీసీల హక్కులను సాధించాల్సిన లక్ష్యాలను సాధించుకోవడానికి రాజ్యాంగాన్ని, అంబేద్కర్ను, అంబేద్కరిజాన్ని భారత చరిత్రను నిరంతరం అధ్యయనం చేయడం అవసరం. స్ఫూర్తిపొందడం అవసరం.

(ఇంకా ఉంది)



- బి ఎస్ రాములు
బీసీ కమిషన్ మాజీ చైర్మన్
8331966987

# 350 ఎకరాలలో ఆక్వా హబ్ ఏర్పాటు

### స్థానికులకే ఉద్యోగావకాశాలు ఇస్తాం

### అవసరమైతే సైన్య శిక్షణ ఇప్పిస్తాం

### సిరిసిల్ల పర్యటనలో పలు కార్యక్రమాల్లో మంత్రి కెటిఆర్

**సిరిసిల్ల,ఏప్రిల్10(ప్రజా మంటలు) :** సిరిసిల్ల జిల్లాలో 350 ఎకరాలలో ఆక్వా హబ్ ఏర్పాటు చేయనున్నామని, అందులో స్థానిక పిల్లలకే ఉద్యోగావకాశాలు కల్పిస్తామని మంత్రి కేటీఆర్



స్పష్టం చేశారు. చీర్లవంచ నుంచి వలస పోయినవాళ్లంతా వాపస్ వస్తున్నారని చెప్పారు. గ్రామంలో జూనియర్ కాలేజీని ఏర్పాటు చేసుకుందామన్నారు. చీర్లవంచకు త్వరలో ఒక పీహెచ్సీని తీసుకొస్తామని, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరత లేకుండా చూస్తామని వెల్లడించారు. మంత్రి కేటీఆర్ సిరిసిల్ల జిల్లాలో పర్యటించారు. తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. తంగళ్లపల్లి మండలంలోని చీర్లవంచలో సబ్స్టేషన్ ప్రారంభించారు, ఎస్సీ కమ్యూనిటీ హాల్, ముదిరాజ్ సంఘ భవన్కు శంకుస్థాపన చేశారు. గ్రామంలో అంబేద్కర్, చాకలి ఐలమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. ఇండ్లు లేని ప్రతి ఒక్కరికి ఇండ్లు ఇప్పించే బాధ్యత తనదని చెప్పారు. రోడ్ల అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూర



య్యాయని తెలిపారు. గృహలక్ష్మి పథకం కింద అర్హులకు రూ.3 లక్షల సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. చీర్లవంచలో రూ.12 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. గ్రామంలో అప్పర్ ప్రైమరీ స్కూల్ను ఏర్పాటు చేసుకుందామని చెప్పారు. దళితులలో ఉన్న పేదరికాన్ని నిర్మూలించేందుకే దళిత బంధు కార్యక్రమం అమలుచేస్తున్నామన్నారు.

# ఉద్యోగల పేరుతో కెసిఆర్ మోసం

### అఖిలపక్షభేటీలో మండిపడ్డ షర్మిల

**హైదరాబాద్,ఏప్రిల్10(ప్రజా మంటలు) :** తెలంగాణలో నిరుద్యోగులను కెసిఆర్ ఉద్యోగాల పేరుతో మోసం చేశారని వైఎస్సార్టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. నిరుద్యోగుల పక్షాన పోరాటం తప్పదని హెచ్చరించారు. ఇందుకునా తెలంగాణ తెచ్చుకుందని



ప్రశ్నించారు. ఈ మేరకు అఖిల పక్షాలన్నీ ఏకమై ఉమ్మడిగా పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. దానికోసం సోమవారం షర్మిల మొదలుపెట్టిన టీ-సేవ్ అనే కార్యక్రమానికి అఖిల పక్షాలు హాజరయ్యాయి. ఈ కార్యక్రమంలో మాట్లా డిన షర్మిల.. రాష్ట్ర ప్రభుత్వ పని తీరుపై మండిపడ్డారు. నిరు ద్యోగుల సమస్యలపై పట్టించుకోని సర్కారుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వల్ల తెలంగాణ నిరుద్యోగులకు, విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతోంది షర్మిల అన్నారు. ఫీ రియంబర్స్ మెంట్, ఉద్యోగాల భర్తీ, యూనివర్సిటీల్లో వసతుల కల్పనకు ఫోరమ్ పోరాటం చేస్తోందని వెల్లడించారు. 1లక్ష 91 వేల ఉద్యోగ ఖాళీగా ఉన్నాయని పిఆర్సీ కమిషన్ చెప్పుంటే.. కేసీఆర్ మాత్రం కేవలం 80 వేల ఖాళీలు ఉన్నాయని చెప్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ మెడలు వంచాలంటే అఖిల పక్షాలన్నీ ఒకటి కావాలని, రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఐక్య వేదిక, ఉమ్మడి కార్యాచరణ ఖరారు చేయాలని కోరారు. ఈనెల 17 న ఒక వేదికపై 24 లేదా 48 గంటలు నిరాహార దీక్ష చేసేందుకు షర్మిల సిద్ధం అయ్యారు. ప్రగతి భవన్ ను ముట్టడి చేసి రోజంత అక్కడే కూర్చోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి దయాకర్, గద్దర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సై శ్రీనివాస దంపతుల ఆత్మహత్య కేసు

### వీడని అనుమానాలు..దర్యాప్తు చేస్తున్న పోలీసులు..

**జనగామ,ఏప్రిల్10(ప్రజా మంటలు) :** జనగామ టౌన్ ఎస్సై కాసర్ల శ్రీనివాస్ దంపతుల ఆత్మహత్య మిస్టరీలా మారింది. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అయితే వారు



అసలు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారన్న విషయంలో కారణాలు దొరకడం లేదు.ఇంట్లో ఉండే ఇద్దరూ చనిపోవడంతో కారణాలు కనుక్కోవడం పోలీసులకు కష్టంగా మారింది. ఎస్సై శ్రీనివాస్ భార్య స్వరూప ఇటీవల ఉరేసుకొని చనిపోయింది. సుమారు 2 గంటల వ్యవధిలో అందరూ ఘటనా స్థలం వద్ద ఉండగానే ఎస్సై శ్రీనివాస్ కూడా సర్వీస్ రివాల్వర్తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది.శ్రీనివాస్ జనగామ టౌన్ పీఎస్లో సుదీర్ఘ కాలంగా పనిచేయడం, అందరితో కలుపుగోలుగా ఉండడంతో ఆయన మృతిపై స్థానికంగా చర్చ జరుగుతోంది. డ్యూటీలో, బయట ఫ్రెండ్లీగా ఉండే ఎస్సై పర్సనల్ లైఫ్లో మాత్రం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు. ఆర్థిక పరమైన అంశాల్లో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎస్సై దంపతుల ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకునేందుకు ఏసీపీ కొత్త దేవేందర్రెడ్డి ఆధ్వర్యంలో ఎంక్వైరీ చేస్తున్నారు. ఎస్సై దంపతులు ఆత్మహత్య చేసుకున్న రోజు రాత్రి ఒకటిన్నర వరకు భార్యభర్తలిద్దరూ గొడవ పడ్డట్లు ఇరుగు పొరుగు వారు చెబుతున్నారు. తెల్లవారే సరికి ఎస్సై భార్య స్వరూప ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న స్థానికులు, ఫ్రెండ్స్, డిపార్ట్మెంట్ వ్యక్తులు వచ్చి ఎస్సైని పరామర్శించారు. ఎవరు ఏం అడిగినా ఎస్సై సమాధానం చెప్పలేదని తెలుస్తోంది.

ఎస్సై వద్ద నుంచి మూడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బెడ్రూం, బాత్రూంను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్సై శ్రీనివాస్ వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్ను పోలీసులు స్వాధీనం చేసుకొని ఉంటే ఆయన ఆత్మహత్య చేసుకునేవారు కాదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఎంక్వైరీలో భాగంగా సెల్ఫోన్లు స్వాధీనం చేసుకోగానే ఎస్సై శ్రీనివాస్ బాత్రూంకని చెప్పి వెళ్లి రివాల్వర్తో కాల్చుకొని చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. దీంతో అసలు సెల్ఫోన్లలో ఏముంది, వాటిని స్వాధీనం చేసుకోగానే ఎస్సై ఎందుకు భయపడ్డారన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.స్వరూప ఉరేసుకొని చనిపోవడంతో మానసికంగా కుంగిపోయాడా ? అవమానభారంతో ఆత్మహత్య చేసుకున్నాడా ? లేక మరేదైనా కారణం ఉందా ? అని తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఎస్సై సెల్ఫోన్ కాల్ డేటా తెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. కాగా తమ తల్లి ఉరేసుకోవడంతోనే భరించలేకే తమ తండ్రి శ్రీనివాస్ ఆత్మహత్య

# 21కి బండి సంజయ్ కేసు వాయిదా

### విచారణకు సహకరించడం లేదని హైకోర్టులో ఫిర్యాదు

**హైదరాబాద్,ఏప్రిల్10(ప్రజా మంటలు) :** పదో తరగతి పేపర్ లీకేజీ కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ దాఖలు చేసిన పిటిషన్ పై తదుపరి విచారణను ఏప్రిల్ 21కి వాయిదా వేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బండి సంజయ్ రిమాండ్ ఆర్డర్ పై విచారణ చేపట్టిన




కోర్టుకు.. ఆయన బెయిల్ మీద బయటికి వచ్చారని అడ్వకేట్ జనరల్ తెలియ జేశారు. బండి సంజయ్ పోలీసుల విచారణకు సహకరించడం లేదని, ఆయన తన ఫోన్ హ్యాండ్ ఓవర్ చేయకపోతే తదుపరి చర్యలు తీసు కుంటామని ప్రభుత్వ తరపు న్యాయవాది తెలిపారు. విచారణకు సహకరించనందుకు గానూ బండి సంజయ్ బెయిల్ రద్దు చేయండంటూ ఏజీ కోరారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ బెయిల్ రద్దుపై అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. రిమాండ్ మీద విచారణ అవసరం లేదని ప్రభుత్వ తరపు న్యాయవాది వాదించడతో.. రిమాండ్ ఇల్లీగల్ మీద వాదనలు వినిపిస్తామని బండి సంజయ్ తరపు న్యాయవాది స్పష్టం చేశారు. అనంతరం ఫోన్ ఇవ్వకపోవడం, పోలీసులకు సహకరించడం లేదన్న విషయాలను అఫిడవిట్ లో దాఖలు చేసి రికార్డ్ లో ఉంచాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 21కి వాయిదా వేస్తూ తీర్పు ఇచ్చింది.

## ఐక్యతతోనే మాలల అభివృద్ధి
## మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మ్యాదరి శ్రీహరి

**జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** మాలలందరు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మ్యాదరి శ్రీహరి అన్నారు. సోమవారం మాల మహానాడు యువత ప్రధాన కార్యదర్శిగా ఉమ్మడి రవి నియామకాన్ని చేపట్టిన అనంతరం మ్యాదరి శ్రీహరి మాట్లాడారు. అంబేద్కర్ అంటే కేవలం ఒక రాజ్యాంగానికి పరిమితం కాదని ఆర్బీఐ కె దిశా నిర్దేశం చేసిన



మహనీయుడన్నారు. మహిళలకు పురుషులతో సమాన హక్కు ఉండాలన్న ఉద్దేశంతో హిందుకోడ్ బిల్లును ప్రవేశపెట్టారన్నారు. రానున్న రోజుల్లో వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడాలని ఏకమై హక్కులు సాధించుకోవాలని శ్రీహరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరాల మహేష్, యువజన ప్రధాన కార్యదర్శి ఎర్ర గోకుల కీర్తి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్ర రాజు, జనరల్ సెక్రెటరీ చింతకుంట్ల గంగాధర్, మాల మహానాడు జిల్లా యూత్ అధ్యక్షులు కోడిపెల్లి విష్ణు, రూరల్ మండల అధ్యక్షులు రాకేష్, నాయకులు తరాల చిన్న గంగన్న, కోడిపెల్లి భోగి కుమార్, రాజు, సిపెల్లి చందు తదితరులున్నారు.

## 'కాలేజీ నుండి కార్పొరేట్ కు'
## అనే వ్యక్తిత్వ వికాసంపై సెమినార్

**జనగామ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలోని వికాస్ డిగ్రీ కాలేజీ లో ప్రముఖ ఇంటర్నేషనల్ ట్రైనర్ మల్లేశం చే 'కాలేజీ టూ కార్పొరేట్ ' అనే




అంశం పై సుదీర్ఘ సెమినార్ నిర్వహించారు. మల్లేశం ఊపన్యసిస్తూ విద్యార్థి దశలోనే నిరంతర అధ్యయనం, భాష నైపుణ్యం మెరుగు పరుచుకొవాలని, విద్య ఉన్నపుడే వ్యక్తి భూమి అంచుల వరకైనా ప్రయాణించగలరని అభివర్ణించారు. ఈ సెమినార్ లో కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల ఛైర్మెన్, భోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## బలగం చిత్రం బంధాలను కలుపుతూ ఉంటే,
## మమ్ము బదనాం చేసిందని ఫిర్యాదు చేసిన ఎంపీటీసీలు

**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** బలగం చిత్రం కుటుంబ బంధాలను కలుపుతూ ప్రతి పల్లెలో గ్రామాలలో బలగం చిత్రం ప్రదర్శన చూపిస్తూ కుటుంబాల మధ్య విభేదాలు లేకుండా కలిసి ఉండాలని చిత్రప్రదర్శన చూపిస్తున్న సమయంలో,



బలగం చిత్రంలో సన్నివేశాల వాక్యాలు మా మనోభావాలను కించపరిచే విధంగా ఉన్నాయని ప్రజలు మా మీద నమ్మకం కోల్పోయే విధంగా ఉన్నాయి. మేము ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులము అని బలగం చిత్రం దర్శకుడు వేణు పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, దానిలోని సన్నివేశాల మాటలను తీసివేయాలని ఇబ్రహీంపట్నం మండలం ఎంపీటీసీలు తహసిల్దార్ మహేశ్వర్ కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు పొనుకంటి చిన్న వెంకటి, అక్కనపెల్లి జలేష్, తిమ్మని రాములు, దేశెట్టి శాంత జీవన్, మలోత్ సరోజన సుదర్శన్ పాల్గొన్నారు.

## ఉద్యోగం ఇస్తామని ఇవ్వలేదని
## న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు

**దేవరుప్పుల ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో 33/11 కె.వి. సబ్ స్టేషన్ నిర్మాణం తమ స్వంత వ్యవసాయ



భూమి సర్వే నెం 472/ఏ1 లో విస్తీర్ణం 1-00 ఎకరం భూమిని ఎన్.పి.డి.సి.ఎల్. జనగామ తరుపున నాటి అసిస్టెంట్ ఇంజనీర్ ఎ.ఈ. బోయిని సత్తయ్య 2011 సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన తీసుకొని నష్ట పరిహారం డబ్బులు గాని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం గాని ఇస్తామని ఇవ్వలేదని, న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి ఏకే మన్సూర్ కి పైండ్ల సోమయ్య అనే రైతు వినతి పత్రం సమర్పణ.

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**జనగామ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి, ప్రజావాణి కార్యక్రమాన్ని జనగామ జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య నిర్వహించారు. బొమ్మర గ్రామం పాలకుర్తి మండలం జనగామ జిల్లాకు చెందిన దండే బోయిన కుమార్, అక్రమంగా తన భూమిని పట్టేదారు పాసుపుస్తకాలు చేసుకొని తనను బెదిరిస్తున్నారని వారిపై తగిన చర్యలు తీసుకొని రద్దు చేయాల్సిందిగా దరఖాస్తు చేసుకున్నారు. లింగాల గణపురం మండలం పటేల్ గూడెంకు చెందిన కడుదూరి వెంకటయ్య, 1995లో కొనుగోలు చేసిన వ్యవసాయ భూమిని అప్పటినుండి ఇప్పటివరకు కబ్జాలో ఉన్నానని అట్టి భూమిపై ధరణి పోర్టల్ లో ఎక్కించి పాసుబుక్కు ఇచ్చి రైతు బంధు పథకం వర్తింపజేయాలని దరఖాస్తు చేసుకున్నారు. పట్టణంలోని జిఎంఆర్ కాలనీ వాసుల 50 ఫీట్ల రోడ్డును అక్రమంగా ఫినిషింగ్ చేసి గోడ నిర్మాణం చేస్తున్నా వారిపై చర్యలు తీసుకొని అతి నిర్మాణంలో ఆపవలసిందిగా జిఎంఆర్ కాలనీవాసులు దరఖాస్తు చేసుకున్నారు. రఘునాథపల్లి మండలం కుర్చనపల్లి గ్రామానికి చెందిన పి. వెంకట్ రెడ్డి, తన నాలుగు ఎకరాల భూమిని తన కొడుకు కోడలు పట్టా చేసుకొని తమను పట్టించుకోవడంలేదని అనారోగ్య పాలు అవడం జరుగుతుందని, నా భార్య వైద్య ఖర్చుల నిమిత్తం నా కొడుకు కోడలు తో మాట్లాడి న్యాయం చేయవలసిందిగా దరఖాస్తు చేసుకున్నాడు. లింగాల గణపురం మండలం నాగారం గ్రామానికి చెందిన పిట్టల వెంకట వీర మల్లయ్య, తాను నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తిని తనకు అంత్యోదయ కార్డు మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ శాఖకు సంబంధించి (44) దరఖాస్తులు రాగా ఇతర విభాగాలకు చెందినవి మొత్తం కలిపి (62) దరఖాస్తులు ప్రజావాణిలో వచ్చాయని ఇట్టి దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరిస్తామని లేని పక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రజావాణి నుండి వచ్చే దరఖాస్తులను అధికారులు వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో



రెవెన్యూ డివిజనల్ అధికారులు సిహెచ్. మధుమోహన్, కృష్ణవేణి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. రామిరెడ్డి, ఎస్డీఎస్-ఎల్ఎస్సి వేణుమాధవ్, డీఈవో వినోద్ కుమార్, డిపిఓ రంగాచారి, జడ్పీ సీఈవో వసంత, మున్సిపల్ కమిషనర్ రజిత, ఆర్టీసీ డిఎం జ్యోత్స్న, సిపిఓ ఇస్మాయిల్, కలెక్టరేట్ పరిపాలన అధికారి మనసూరి, జిల్లాలోని అధికారులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్త చెరువు శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలు
## తొలగించాలని అదనపు కలెక్టర్‌కు సిపిఐ నేతల ఫిర్యాదు

**హుస్నాబాద్ 10 ఏప్రిల్ (ప్రజామంటలు):** హుస్నాబాద్ పట్టణంలోని సర్వే నెంబర్ 644, 645 కొత్త చెరువు శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలు జరుతున్నాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు వరుస సెలవు దినాల్లో చూసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు శిఖం భూమిలో నిర్మాణం పనులు జరుగుతున్నా మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ ఏమాత్రం పట్టించుకోవడం లేదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ముజమిల్ ఖాన్ కు ఫిర్యాదు చేసినట్లు గడిపె మల్లేశ్ తెలిపారు. అనంతరం తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ ను కలిసి కొత్త చెరువులో జరుగుతున్న నిర్మాణం పనులను తహశీల్దార్, కమిషనర్ కు స్వయంగా చూపించారు. గతంలో ఇలాగే కొత్త చెరువు శిఖం భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు వేలాది ట్రిప్పుల మట్టితో కొత్త చెరువును పూడ్చాలని చూస్తే సిపిఐ ఆధ్వర్యంలో అప్పటి జిల్లా కలెక్టర్ వెంకట్రామరెడ్డి ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ రియల్ ఎస్టేట్ వ్యాపారులతో మట్టిని తొలగించిన విషయం గుర్తు చేశారు. కలెక్టర్ ను కలిసిన వారిలో గడిపె మల్లేశ్ తో పాటు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి యెడల వనేష్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజివరెడ్డి, సిపిఐ మండల నాయకులు అయిలేని





మల్లారెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జనగాం రాజు కుమార్, రయికుంట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా

**జనగామ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం జనగామ జిల్లా సమితి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించి తదుపరి ప్రజావాణిలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళపల్లి జనార్దన్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల కు అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, ఇండ్లు లేని నిరుపేదలకు యింటి స్థలం కేటాయించి యింటి నిర్మాణానికి ఆరు లక్షల రూపాయలు ఇవ్వాలని, కార్మికులకు 50 సంవత్సరాలకు 5 వేల పెన్షన్ ఇవ్వాలని, ప్రతి వ్యవసాయ కార్మికునికి మూడెకరాల భూమి ఇవ్వాలని గ్రామీణ ఉపాధి హామీ పథకనికి రెండు లక్షల కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని సంవత్సరానికి రెండువందల రోజుల పనికాకల్పించి రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని వేసవి కాలం అలవెన్సులు 50 శాతం పెంచాలని పనులు జరుగుతున్న ప్రాంతంలో కనీస



సౌకర్యాలు సేద తీర్చుకొనేందుకు టెంటు మంచి నీళ్ళు మజ్జిగ ప్యాకెట్స్ ఓ.ఆర్.ఎస్. మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మండల గట్టుమల్లు, నల్ల పెద్ద మైసయ్య, పిట్టల కుమార్ రాడపాక సత్యం, యాకుబ్ పాషా, మంద బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కులను
## అందించిన ఎమ్మెల్యే, జెడ్పీ ఛైర్ పర్సన్

**జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణానికి చెందిన 68 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 17 లక్షల 50 వేల రూపాయల విలువగల చెక్కులను, జగిత్యాల రూరల్ మండలానికి చెందిన 50 మంది లబ్దిదారుల మంజూరైన 13 లక్షల 67 వేల రూపాయల విలువగల చెక్కులను జగిత్యాల బిఆరెస్ పార్టీ కార్యాలయం మోతె రోడ్డులో పంపిణీ చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జెడ్పీ చైర్మన్ దావా వసంత సురేష్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతనే ముఖ్యమంత్రి పలు రకాల చికిత్సలు చేసుకొని ఆర్థికంగా నష్టపోయిన పేద ప్రజలకు ఆర్థికంగా ఊరట కల్పించే ఉద్దేశంతో సీఎం సహాయనిధి ద్వారా చెక్కులను పంపిణీ చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ,ప్రైవేటు ఆసుపత్రిలో ఆరోగ్య శ్రీ లో ఆరోగ్య సేవలను పెంచి ఉచిత చికిత్సలు అందిస్తున్నారని,ప్రభుత్వ ఆసుపత్రిలో మగ పిల్లాడు జన్మిస్తే 12 వేలు, ఆడ పిల్ల అయితే 13 వేలు,కెసిఆర్ కిట్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని నేడు మెడికల్ హబ్ గా జగిత్యాల మారిందని అన్నారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వస్తుంది అని అన్నారు.మాతా శిశు ఆసుపత్రిలో పలు కారణాలతో గర్భిణీలు మరణించారని, ప్రతి పక్షాలు అసత్య ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని నిత్యం పదుల సంఖ్యలో ప్రసవాలు జరుగుతున్నాయి అని అన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రి సేవలు ఉపయోగించు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ గోలి శ్రీనివాస్, ఎంపీపీ రాజేంద్ర ప్రసాద్, పట్టణ మండల పార్టీ అధ్యక్షులు గట్టు సతీష్, బాల ముకుందం, ప్యాక్స్ ఛైర్మెన్ లు మహిపాల్ రెడ్డి, సందీప్ రావు, కౌన్సిలర్ లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచి లు, నాయకులు పాల్గొన్నారు.

## యాదవ హక్కుల పోరాట సమితి
## మండల అధ్యక్షుడుగా పరశురామ్


**చిగురుమామిడి ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బండి మల్లయ్య యాదవ్ జిల్లా కార్యదర్శి గంగుల లింగం కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో చిగురుమామిడి మండల నూతన కమిటీ ఏర్పాటు చేయడం



జరిగింది. చిగురుమామిడి మండల అధ్యక్షుడుగా లంబాడి పల్లె గ్రామానికి చెందిన చెందబోయిన పరశురామ్ యాదవ్, ఉపాధ్యక్షులుగా పోతరవేణి నరసయ్య యాదవ్, చందబోయిన మల్లయ్య యాదవ్, కుమారస్వామి యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ముక్కెర మోహన్ యాదవ్, సహాయ కార్యదర్శిగా గౌడ బిక్షపతి యాదవ్, మద్రి సతీష్ యాదవ్ లను, గౌరవ అధ్యక్షునిగా మొగిలి బోందయ్య యాదవు ను ఎన్నుకోవడం జరిగింది చందబోయిన పరశురాం యాదవ్ మాట్లాడుతూ.... ఈ ఎన్నికకు సహకరించిన వారందరికీ, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.

## జగిత్యాల క్లబ్ ఎన్నికలు,
## సెక్రెటరీగా ముస్కు నారాయణ రెడ్డి

జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజామంటలు): జగిత్యాల క్లబ్ ఎన్నికల్లో క్లబ్ సెక్రెటరీ గా గెలుపొందిన ముస్కు నారాయణ రెడ్డి, కార్యవర్గ సభ్యులు సోమవారం జగిత్యాల



జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ను మర్యాద పూర్వకంగా కలవగా శు భాకాంక్షలు తెలిపి అభినందించిన జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్.

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో
## ఎమ్మెల్యే క్యాంపస్ కార్యాలయం ముట్టడి

**జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజామంటలు)** టియస్ పిఎస్సీ, 10 వ తరగతి పేపర్ లీకులను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడికి యత్నించారు. పోలీసులు యూత్ కాంగ్రెస్ నాయకులను



అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండా మధు మాట్లాడుతూ.... రాష్ట్రంలో ఇన్ని లీకులు జరగుతున్న విద్యార్థి, నిరుద్యోగ యువత జీవితాల గురించి బీఆర్ఎస్ నాయకులకు లకు చీమకుట్టినట్లు లేదన్నారు.

**అరెస్టులతో యూత్ కాంగ్రెస్ పోరాటం ఆగదు.**

ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు నేహల్, నక్క జీవన్, అనుగందుల కిరణ్, కట్ట శివ, అసెంబ్లీ అధ్యక్షుడు బాపు రెడ్డి, రియాజ్, రాగుల ప్రదీప్, అనిల్, అర్బబ్, జితేందర్, అసాది హరీష్, పట్టణ అధ్యక్షుడు బిరం రాజేష్, శివ, తిరుపతి, నరేష్, బోగ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాధాన్య క్రమంలో
## ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

### కలెక్టర్ యాస్మిన్ భాష

**జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్. సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా



అదనపు కలెక్టర్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 23 ఫిర్యాదులు, వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

# ఒకటో తేదీనే పెన్షన్ జమచేయాలి

## కొత్త పి.ఆర్.సిని అమలు చేయాలి.

**హనుమకొండ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** తెలంగాణా పెన్షనర్ సంఘాల పిలుపు మేరకు పెన్షనర్ ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్న నిర్లక్షవైఖరిని ఖండిస్తూ అఖిల భారత పెన్షనర్ల ఫెడరేషన్ మరియు తెలంగాణా పెన్షనర్ల జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా



వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు ధర్నా నిర్వహించారు. పది ప్రధాన డిమాండ్ల ను పేర్కొంటూ పరిష్కరించాలంటూ జాయింట్ కలెక్టర్ కు మెమోరాండం అందజేశారు. పిఎమ్, సిఎమ్ లకు చేరే విధంగా ఇచ్చినట్లు తెలిపారు. ఈ నిరసన దీక్ష లో పెన్షనర్ల జేఏసి రాష్ట్ర కమిటీ సభ్యులు వీరాస్వామి, ఎస్ జిపిఏటి రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య, జిల్లా అధ్యక్షులు కర్రు సుధీర్ బాబు జిల్లా, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జనగామ కవులకు ప్రపంచ తెలుగు సాహితీ పురస్కార ప్రధానం

**జనగామ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో ఐఎస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త



ఆధ్వర్యంలో ఏప్రిల్ 9, 10 తేదీలలో తిరుమల తిరుపతిలో మహతి ఆడిటోరియం నందు నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలలో సోమవారం జనగామ జిల్లా కవులు ఘన సన్మానం పొందారు. కవి, కళావేదిక జనగామ జిల్లా అధ్యక్షుడు లగిశెట్టి ప్రభాకర్, శ్రీ శ్రీ కళావేదిక యువజన అధ్యక్షుడు, వర్ధమాన కవి యువ సంగీత దర్శకులు చిలుమోజు సాయికిరణ్,కవయిత్రి బుదారపు లావణ్య, కవులు, కళాకారులు వుప్పుల కిరణ్ కుమార్, మాన్యపు భుజేందర్,అంకాల సోమయ్య, జోగు సుధాకర్, చాపల మహేందర్, జోగు సుదర్శన్ అందుకున్నారు. ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల పురస్కారాన్ని సంస్థ అంతర్జాతీయ చైర్మన్ గుర్రం జాషువా అవార్డు గ్రహీత డాక్టర్ కత్తిమండ ప్రతాప్ జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, రాష్ట్ర అధ్యక్షురాలు కట్ల భాగ్యలక్ష్మి, రాష్ట్ర కమిటీ కన్వీనర్ నూక సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీలో చేరిన రాయికల్ మండల ఏకలవ్యులు

**జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** రాయికల్ మండల మాజీ ఎంపీపీ ఉత్కం రాధ సాయ గౌడ్ ఆధ్వర్యంలో ఇటిక్యాల గ్రామానికి చెందిన ఎరుకల (ఏకలవ్య)



కులస్తులు 50 మంది బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీ లో చేరగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో ఆలూరు ఎంపీటీసీ సురేందర్ రెడ్డి,మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ కొల్లూరి వేణు, రఘునాథ్, రవి, లక్ష్మీపతి రావు, రాజేందర్ పాల్గొన్నారు.



మహారాష్ట్రలోని సోలాపూర్ నగరంలో బిఆర్ఎస్ పార్టీలో చేరికల సందర్భంగా సోలాపూర్ నగర గెస్ట్ హౌస్ లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ వచ్చిన సందర్భంగా వారికి ఘనంగా స్వాగతం పలికి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ ధర్మన్న సాధుల్, అఖిల భారత పద్మశాలి సంఘం నాయకులు గణేష్ పెనుగొండ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమన్వయం కోసమే ఆత్మీయ సమ్మేళనం

- ప్రజాక్షేత్రంలోకి గులాబీ సేన, కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు
- మూడోసారి బిఆర్ఎస్ గెలుపు ఖాయం
- మండలంలోని ప్రతి ఎకరానికి నీళ్లు తెచ్చే భాధ్యత నాదే- ఎమ్మెల్సీ పల్లా
- తొమ్మిది సంవత్సరాల కాలంలో తెలంగాణకు నయా పైసా ఇవ్వని నరేంద్రమోదీ

**వేలేరు ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమన్వయం కోసమే ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే రాజయ్య, రాష్ట్ర రైతు బంధు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని షోడాషపల్లి ఎస్.ఎస్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి జిల్లా ఇంఛార్జి ఎమ్మెల్సీ కోటిరెడ్డి తో కలిసి వారు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే రాజయ్య సీఎం కేసీఆర్ పంపిన సందేశాన్ని ఆత్మీయ సమావేశానికి హాజరైన కార్యకర్తలకు చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... వేలేరు మండలంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందించే భాధ్యత నాదేనని అన్నారు. అలాగే వేలేరు మండలంలో డబుల్ రోడ్డుతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. మండలంలోని ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు అందించే విధంగా సీఎం కేసీఆర్ తో మాట్లాడుతానని తెలిపారు. అలాగే రానున్న గృహలక్ష్మీ పథకం లో పేదలైన బీఆర్ఎస్ కార్యకర్తలకు ముందుగా ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్రనికి తొమ్మిది సంవత్సరాల కాలంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం నయాపైసా కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. మొన్న హైదరాబాద్ లో సభలో నరేంద్ర మోదీ పచ్చి అబద్ధాలు మాట్లాడాడని విమర్శించారు. మోదీ ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెడుతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం 60 లక్షల మందికి రేషన్ బియ్యం ఇస్తే తెలంగాణ ప్రభుత్వం 90 లక్షల మందికి రేషన్ బియ్యం ఇస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ అని అన్నారు. బీజేపీ పార్టీకి అభ్యర్థులు కరువని అన్నారు. ఘన్ పూర్ నియోజకవర్గంలో ఏ పనులైన చేయించే భాధ్యత తనదేనని, మీగిలిపోయిన పనులనింటిని పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ...బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో మమేకమయేందుకు , కార్యకర్తల కష్ట సుఖాలు తెలుసుకోవడానికి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఆత్మీయంగా కలుసుకోవడానికి ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని విధంగా వినూత్నమైన పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తూ తెలంగాణలోని పథకాలను గడపగడపకు అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో తెలంగాణ తరహా పథకాలేవని బిజెపి నాయకులను ప్రశ్నించారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో చేయని అభివృద్ధి తెలంగాణలో చేస్తామని బిజెపి నాయకులు చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. బిజెపి నాయకుల మాటలు తెలంగాణ ప్రజలు ఎవ్వరు నమ్మవద్దని




సూచించారు. బిఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడు తున్నాయని అన్నారు. ప్రజలలోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్ర మాలను వివరించాలని పిలుపు నిచ్చారు. రానున్న శాసనసభ ఎన్ని కల్లో బీఆర్ఎస్ ప్రభంజనానికి బిజెపి , కాంగ్రెస్ కొట్టుకుపోయే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నా యని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, ఎంపీపీ సమ్మిరెడ్డి , జడ్పీటీసీ చాడ సరిత విజేందర్ రెడ్డి, జిల్లా డీసీసీబీ డైరెక్టర్ గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, చిల్పూర్ గుట్ట దేవాలయ చైర్మన్ శ్రీధర్ రావు, జిల్లా ఆత్మ చైర్మన్ కీర్తి వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు మరిజె నర్సింగరావు, వైస్ ఎంపీపీ ఆంగోతు సంపత్, మండల సమన్వయకర్తలు బిల్లా యాదగిరి, మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు , గ్రామశాఖల అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# వేరియంట్ ఏదైనా.... కోవిడ్‌తో యుద్ధానికి తాము సర్వం సిద్ధం

- సూపరింటెండెంట్ ప్రొ. రాజారావు
- గాంధీ ఆసుపత్రిలో కోవిడ్ మాక్ డ్రిల్

**సికింద్రాబాద్ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** కరోనా కేసులు భవిష్యత్ లో పెరిగినా, తాము సమర్ధవంతంగా ఎదుర్కోడానికి గాంధీ ఆసుపత్రిలో అన్ని రకాల కోవిడ్ ట్రీట్మెంట్ సదుపాయాలు రెడీగా ఉన్నాయని, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ఎం. రాజారావు స్పష్టం చేశారు. దేశంలో మళ్ళీ పెరుగుతున్న కరోనా కేసుల నేపధ్యంలో కేంద్రం ఆదేశించిన మేరకు గాంధీ ఆసుపత్రిలో సోమవారం అధికారులు కోవిడ్ మాక్ డ్రిల్ నిర్వహించారు. డీఎంఈ డా. కే. రమేశ్రెడ్డి, గాంధీ సూపరింటెండెంట్ ప్రొ. రాజారావు లు ఆర్ఎంవోలు, డిప్యూటి సూపరింటెండెంట్, సీఎంవో, వైద్య సిబ్బందితో కలసి గాంధీలోని లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్లు, ఆక్సిజన్ మనిఫోల్డ్స్, వెంటిలేటర్స్, ఐసీయూ, ఆక్సిజన్ బెడ్స్ లను పరిశీలించారు. వీటి పని తీరును పరిశీలించి, కండిషన్ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ ప్రొ.రాజారావు మీడియాతో మాట్లాడుతూ...గాంధీ ఆసుపత్రిలో గతంలో మూడు కోవిడ్ వేవ్ లను సమర్ధవంతంగా ఎదుర్కొన్నామని, వేలాది మంది కోవిడ్ పాజిటివ్ పేషంట్లకు ట్రీట్మెంట్ అందించి, వారిని కాపాడగలిగామన్నారు. ఆసుపత్రిలో ప్రస్తుతం మొత్తం 46 కిలో లీటర్ల కెపాసిటీ కలిగిన మూడు లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకులున్నాయని, పీఎస్ఏ యూనిట్స్, ఆక్సిజన్ మానిఫోల్డ్స్, ఆక్సిజన్ కన్సెంట్రేటర్స్ పూర్తిస్థాయిలో కండిషన్ లో ఉన్నాయన్నారు. అలాగే వెంటిలేటర్స్ 535, మల్టీ ఛానల్ మానిటర్స్ 350, సీ-ప్యాప్ మెషిన్లు 100, బీ-ప్యాప్ మెషిన్లు 100 తో పాటు ఆక్సిజన్ కన్సెంట్రేటర్స్ 185 ఉన్నాయన్నారు. ఐసీయూ బెడ్స్ 650, ఆక్సిజన్ బెడ్స్ 650, జనరల్ బెడ్స్ 650 మొత్తం 1950 మొత్తం బెడ్స్ ఉన్నాయన్నారు. ఒకేసారి 5వేల మంది పాజిటివ్ పేషంట్లకు ఆక్సిజన్ అందించే పటిష్టమైన ఏర్పాట్లు గాంధీ లో ఉన్నాయన్నారు.

**కోవిడ్ జాగ్రత్తలు పాటించండి:**

దేశంలో మళ్ళీ కరోనా కేసులు పెరుగుతున్న నేపధ్యంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా కోవిడ్ రూల్సా్పటించాలని, మాస్కు ధరించాలని, తరచుగా శానిటైజర్ వాడాలని సూపరింటెండెంట్



విజ్ఞప్తి చేశారు. మాక్ డ్రిల్ లో డిప్యూటి సూపరింటెండెంట్ డా. శోభన్ బాబు, ఆర్ఎంవోలు డా. జయకృష్ణ, డా. ప్రభు కిరన్, డా. వెంకటరమణ, డా. రాము, డా. యోగేందర్, గాంధీ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా. కృష్ణమోహన్, సీఎంవోలు డా. కిరణ్, డా. విష్ణు, డా. లక్ష్మీకాంత్, నర్సింగ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కోరుట్ల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో

# కోరుట్ల ఎమ్మెల్యే ఇల్లు ముట్టడి

**కోరుట్ల ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** పిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీతో 35 లక్షల మంది విద్యార్థుల జీవితాలు బిఆర్ఎస్ ప్రభుత్వం నాశనం చేసిందని యువజన కాంగ్రెస్ మెట్ పల్లి పట్టణ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రస్తుతం తెలంగాణలో పేపర్ లీకేజీ హవా నడుస్తుందని బిఆర్ఎస్ పార్టీ కంటే మేము ఎం తక్కువ ఎక్కువ కాదన్నట్టు బిజెపి పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ పదో తరగతి హిందీ పరీక్ష పేపర్ లీకేజీ చేయించడం అనేది ఎంత దౌర్భాగ్యం అని నిరసిస్తూ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు రాష్ట్రంలోని ఎమ్మెల్యేల ఇల్లు ముట్టడిలో బాగంగా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ ఇల్లును యూత్ కాంగ్రెస్ శ్రేణులు ముట్టడి చేయడం జరిగింది. ఇప్పటికయినా బిఆర్ఎస్ బీజేపీ నేతలు ప్రజల జీవితాన్ని ఆగం చేసి అంతటితో ఆగకుండా విద్యార్థుల నిరుద్యోగుల పోటీ పరీక్షలను రాస్తున్న అభ్యర్థుల జీవితాలతో కూడా చెలగాటం ఆడడం దారుణం అని అన్నారు. బీజేపీ బిఆర్ఎస్ లను రాజకీయంగా బొంద పెట్టి అన్ని వర్గాల సంక్షేమం కోసం బాధ్యతాయుతంగా నడుచుకునే కాంగ్రెస్ కు పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెట్టుపల్లి పట్టణ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాజారాం గ్రామంలో రాత్రి ఓ యువకుని హత్య

**మల్యాల ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా మల్యాల మం. రాజారాం గ్రామంలో నిన్న రాత్రి జరిగిన ఘర్షణలో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో కర్రలు, ఇనుప రాడ్లతో దాడికి పాల్పడ్డారు. గుర్రం ప్రవీణ్, వెంకటేష్ అనే యువకులపై అదే గ్రామానికి చెందిన కొందరు ఇనుప రాడ్ లతో దాడి చేయటంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దాడిలో గుర్రం వెంకటేష్ కు తీవ్ర గాయాలు కాగా హుటా హుటిన జగిత్యాల ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు....ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ కి తరలించారు. దాడికి పాల్పడింది శివరాత్రి నరేష్, భాగ్య రాజ్ లుగా గుర్తించారు. మల్యాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# అంబేద్కర్ 132వ జయంతి, కరపత్రాల ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి

**హుజురాబాద్ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** ప్రపంచ మేధావి, నవభారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 132వ జయంతోత్సవ కరపత్రాలను తెలంగాణ ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ హుజురాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్ కలిసి సోమవారం



ఉదయం హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ జయంతి కమిటీ చైర్మన్ ఎర్ర శ్రీధర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ... ఏప్రిల్ 14 హుజురాబాదులో అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగే అంబేద్కర్ జయంతి కి అన్ని వర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ టౌన్ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్ ముక్క రమేష్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గందే శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి విజయ్ కుమార్, చోల్లేటి కిషన్ రెడ్డి ,వేల్పుల రత్నం ,బొరగాల సారయ్య , డాక్టర్ తడికమళ్ళ శేఖర్, బత్తుల రాజలింగం, ఇల్లందుల సమ్మయ్య, తాటిపాముల రాము, రుద్రారపు రామచంద్ర%శీ%, మొలుగూరి నాగరాజు, ఎర్ర రాజకుమార్, మేకల మల్లేష్, రామ్ రాజేశ్వర్, కొంకటి స్వామి పాల్గొన్నారు.

# రామక్రిష్ణ డిగ్రీ - పీజీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్ వేడుకలు

**జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, జగిత్యాల లో ఫుడ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు చేసిన వంటకాలు ఎంతో రుచికరంగా ఉన్నాయి. తెలంగాణ సంస్కృతి వుట్టిపడేలా విద్యార్థులు తయారు చేసిన వంటకాలు నోరురుంచేలా వున్నాయి. కళాశాల డైరెక్టర్ హరిప్రియ అంజయ్య గౌడ్ మాట్లాడుతూ.... 'తిండి కలిగితే కండ కలదోయ్' అన్న గురుజాడ వారి మాటలు గుర్తుకు వచ్చేలా ఎంతో శక్తిని కలిగించే వంటకాలు తయారు చేయడం ఎంతో అభినందనీయం అని కొనియాడారు. కళాశాల




ప్రిన్సిపాల్ బెజ్జారపు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.... అన్ని రకాల సాంప్రదాయాలకు సంబంధించిన అనేక రకాల వంటకాలు తీసుకువచ్చిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ యాద రామ కృష్ణ , డైరెక్టర్ హరిప్రియ అంజయ్య గౌడ్, ప్రిన్సిపాల్ బెజ్జారపు ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు రాజ్ కుమార్, నాగరాజు, వేణు, సాయిరాం, శ్రీనివాస్ భూమరెడ్డి, రాజేందర్, నాగ భూషణం, గణేష్, సాయి, నవ్య శ్రీ, గంగలక్ష్మి, ఆసిమా, రాజమణి, రంజన, భార్గవి, చారి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్స్ 6-10 క్లాసుల అడ్మిషన్స్ ఎంట్రన్స్ టెస్ట్

**హన్మకొండ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** జిల్లాలోని 6 మోడల్ స్కూల్స్ నందు 2023-24 విద్యాసంవత్సరం కోసం 6 నుండి 10 తరగతుల్లో అడ్మిషన్స్ ప్రవేశ పరీక్ష తేదీ 16.04.2023 రోజున నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి, డి. వాసంతి తెలిపారు. 6 వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10:00 గంటల నుండి 12:00 గంటల వరకు మరియు తరగతులు 7 నుండి 10 వ తరగతి వరకు ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2:00 గంటల నుండి 4:00 గంటల వరకు జరుగును. ఈ పరీక్షలకు కోసం జిల్లాలోని 6 మోడల్ స్కూల్స్ లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, https://telanganams. cgg.gov.in/TSMSWEB వెబ్ సైట్ ద్వారా విద్యార్థులు హాల్ టికెట్ పొందాలని సూచించారు



# విద్యుత్ షాక్ తగిలి ఎలక్ట్రీషియన్ మృతి

### కూలర్ రిపేర్ చేస్తూ ఉండగా విద్యుత్ షాక్....!



**కోరుట్ల ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** కోరుట్ల మండలంలోని పైడిమడుగు గ్రామానికి చెందిన తోకల నవీన్ (30) అనే వ్యక్తి విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం గ్రామములో ఎలక్ట్రిషియన్ పని చేస్తూ ఉండే వాడు. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో స్వతహాగా ఎలక్ట్రీషియన్ అయిన నవీన్ ఆదివారం సాయంత్రం ఇంటిలో కూలర్ రిపేర్ చేస్తూ ఉండగా విద్యుత్ షాక్ కు గురయి అపస్మారక స్థితికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడు. మృతునికి భార్య మౌనిక, రెండేళ్ల కూతురు ధనుశ్రీ ఉన్నారు. నవీన్ మృతి తో గ్రామంలో విషాదం నెలకొన్నది.

# శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

**జనగామ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** ఉచిత కుట్టు శిక్షణ, ఉపాధి, ఉద్యోగ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోనే మొదటి సారిగా పాలకుర్తి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, మొదటి విడత శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మిషన్ల పంపిణీ ని రాష్ట్ర పంచాయతీరాజ్,



గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నియోజకవర్గంలోని దేవరుప్పుల, కొడకండ్ల ల్లో సోమవారం చేపట్టారు. దేవరుప్పుల, కొడకండ్ల లలో వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో శిక్షణ తీసుకున్న మహిళలతో వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వాళ్ళందరినీ ఒక్కొక్కరిని కలుస్తూ, వారితో ఫోటోలు దిగారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికేట్లు, కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, డిఆర్డీవో రెడ్డి, ఎపిడి నూరొద్దిన్, డీపీఎం లు, సీసీ లు, శిక్షణ ఇచ్చిన వారు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు, శిక్షణ కు ఎంపికైన మహిళలు తదితరులు పాల్గొన్నారు.


### బలగం సినిమాకు

# రోజు, రోజుకి పెరుగుతున్న క్రేజ్.

### కాలనీ ప్రజల కోసం పెద్ద స్క్రీన్ పై బలగం సినిమా ప్రదర్శన

### బండమైసమ్మ నగర్‌లో సినిమా చూస్తూ కన్నీళ్ళు పెట్టుకున్న స్థానికులు

**సికింద్రాబాద్ ఏప్రిల్ 10 ( ప్రజామంటలు):** బలగం సినిమాకు రోజు, రోజుకి క్రేజ్ పెరుగుతోంది. సగటు కుటుంబంలో ఎదురయ్యే మానసిక సంఘర్షణలు, సెంటిమెంట్, సంప్రదాయాలు, నమ్మకాలు, బంధాలపై కళ్ళకు కట్టినట్లు చూపించిన సినిమా ప్రస్తుతం రాష్ట్రంలోని పల్లెల్లో గ్రామపంచాయతీల వద్ద పెద్ద



స్క్రీన్ లపై ఊరి జనాల కోసం ప్రదర్శిస్తుండగా, తాజాగా సిటీలోని బన్సీలాల్ పేట డివిజన్ బండమైసమ్మ నగర్ లో స్థానిక డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కాలనీ వాసుల కోసం పెద్ద స్క్రీన్ పై బలగం సినిమాను ప్రదర్శించారు. డబుల్ బెడ్రూమ్ గృహప్రవేశం కల నెరవేరక ముందే కరోనా తో మరణించిన తన తండ్రి పుల్లూరి రామస్వామి స్మారకార్థం ఈ సినిమాను ఉచితంగా ప్రదర్శించినట్లు కాలనీ వాసి, జర్నలిస్ట్ మహేందర్ తెలిపారు. వందల మంది బలగం సినిమాను చూసి, కన్నీరు పెట్టుకొన్నారు.తమ ఇండ్లల్లో గతంలో చనిపోయిన తమ రక్తసంబధీకులను గుర్తుచేసుకొంటూ చెమర్చిన కళ్ళతో సినిమాను చూశారు. బలగం సినిమాను ప్రదర్శించిన మహేందర్ ను పలువురు అభినందించారు.

# శంకర్ విజన్ సెంటర్ ఐ కేర్ హాస్పిటల్ ప్రారంభం

**పెద్దపల్లి ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** సోమవారం పెద్దపల్లి జిల్లా బసంత్ నగర్ లో మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఐఏఎస్ పి. నరహరి వారి తండ్రి కీ.శే. పి. సత్యనారాయణ స్మారకార్థం ఆలయ ఫౌండేషన్ ద్వార నిర్మించిన శంకర్ విజన్



సెంటర్ ఐ కేర్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్ రావు, ఎమ్మెల్యే రఘునందన్ రావు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి, సత్యకుమార్, మాజీ ఎంపీ గరికపాటి మోహన్ రావు, సినిమా యాక్టర్ ఆలీ, బిజెపి నాయకురాలు డా. బోగ శ్రావణి పాల్గొన్నారు.

# చరణ్ - బన్నీ - తారక్.. మల్టీస్టారర్?

ఇటీవల కాలంలో స్టార్ హీరోల మధ్య పోటీ తీవ్రత అయితే చాలా ఎక్కువగా పెరిగిపోయింది. అయితే అలాంటి వాతావరణం పెరిగిన సమయంలో ఇద్దరు స్టార్ హీరోలు ఒక సినిమాలో కలిసి నటిస్తే చూడాలని ఫ్యాన్స్ ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఇక ఎంతో కాలంగా మెగా నందమూరి కాంబినేషన్ కోసం ఎదురుచూసిన వారికి సినిమాతో ఒక కోరిక నెరవేరింది.అయితే ఇప్పుడు రాబోయే భవిష్యత్తులో మరిన్ని మల్టీస్టారర్ సినిమాలు తెలుగులో వచ్చే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. అయితే ముగ్గురు స్టార్ హీరోలు కలిసి ఒక సినిమా చేస్తే కూడా చూడాలని ఫ్యాన్స్ ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. రామ్ చరణ్ తేజ్ జూనియర్ ఎన్టీఆర్ RRR సినిమాలో కలిసి నటించగా ఇప్పుడు వీరిద్దరితో కలిసి అల్లు అర్జున్ తో ఒక సినిమా చేస్తే ఎలా ఉంటుంది అనే ఊహ ఎంతో ఆసక్తిని కలిగిస్తోంది. ఈ ముగ్గురు హీరోలు కూడా ఇప్పుడు బాలీవుడ్ హీరోలతో కలిసి సినిమాలో చేస్తున్నారు. ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్ వార్ సీక్వెన్స్ సినిమాలో భాగంగా హృతిక్ రోషన్తో కలిసి నటించే అవకాశం ఉన్నట్లుగా క్లారిటీ వచ్చేసింది. ఇక అల్లు అర్జున్ కూడా షారుక్ ఖాన్ జవాన్ సినిమాలో నటిస్తాడని అంటున్నారు. ఇక అప్పుడప్పుడు గెస్ట్ రోల్స్ చేస్తున్న రామ్ చరణ్ కూడా బాలీవుడ్ సల్మాన్ ఖాన్ తో ఒక మల్టీస్టారర్ సినిమా చేసే అవకాశం ఉందని కూడా ఆ మధ్య టాక్ వచ్చింది. అయితే ఇదంతా కాకుండా రామ్ చరణ్ తేజ్ ఎన్టీఆర్ అల్లు అర్జున్ ఈ ముగ్గురి హీరోలతో ఒక మాస్ ఇమేజ్ సినిమా కథపడితే మాత్రం బాక్సాఫీస్ రికార్డులు బ్లాస్ట్ అవ్వకుండా ఉండదు. ముగ్గురుకి మంచి క్రేజ్ ఉంది. అలాగే టాలెంటెడ్ డాన్సర్స్. ఇక దాదాపు మార్కెట్ పరంగా చూసుకున్నా కూడా ముగ్గురి కెరీర్ ఒకే త్రం లో కొనసాగుతోంది. అయితే ఈ ముగ్గురు హీరోలను బ్యాలెన్స్ చేయాలి అంటే రాజమౌళితో తెలుసుకోవాల్సి ఉంటుంది. ఆయన మాత్రమే ఈ ముగ్గురిని కరెక్ట్ గా బ్యాలెన్స్ చేయగలరు అని చెప్పవచ్చు. బహుశా భవిష్యత్తులో రాజమౌళి తీసే మహాభారతంలో ఈ ముగ్గురు కలయిక జరగవచ్చు. కానీ అంతకంటే ముందు మంచి మాస్ హైవోల్టేజ్ కమర్షియల్ సినిమా పడితే మాత్రం మామూలుగా ఉండదు అని చెప్పవచ్చు.







# శాకుంతలం టిక్కెట్ల రేట్లు.. ఫ్యామిలీస్ కష్టమే

సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ సమంత లీడ్ రోల్ లో గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన శాకుంతలం మూవీ రిలీజ్ కి రెడీ అవుతోంది. ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలు ప్రస్తుతం చిత్ర యూనిట్ గ్రాండ్ గానే నిర్వహిస్తోంది. ఏకంగా 80 కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ మూవీతో బ్లాక్ బస్టర్ అందుకోవాలని సమంత గట్టి నమ్మకం అయితే పెట్టుకుంది. అలాగే పాన్ ఇండియా ఇమేజ్ తో లేడీ సూపర్ స్టార్ అనే బ్రాండ్ తెచ్చుకోవాలని ఆశ పడుతుంది. ఇప్పటికే యశోదతో సూపర్ సక్సెస్ అందుకున్న సామ్ ఏకంగా 50 కోట్ల క్లబ్ లో చేరగా.. శాకుంతలం మూవీతో వంద కోట్ల క్లబ్ లో చేరాలని గట్టిగా ప్రయత్నం చేస్తోంది. దానికోసం ప్రమోషన్స్ అన్ని తన భుజాల మీద వేసుకుంది. అయితే మైథలాజికల్ కాన్సెప్ట్ లవ్ డ్రామాగా ఈ మూవీ తెరకెక్కడంతో ప్రేక్షకులకి ఏ మేరకు రీచ్ అవుతుంది అనేది చెప్పలేని పరిస్థితి. ఇదిలా ఉంటే ఈ మూవీ ఏప్రిల్ 14న ప్రపంచ వ్యాప్తంగా ఐదు భాషలలో రిలీజ్ అవుతోంది. ఇక ఈ సినిమాకి సంబందించిన టికెట్ ధరలు ప్రస్తుతం కన్ఫర్మ్ అయినట్లు సమాచారం. తెలంగాణలో టికెట్ ధరలు 2డీ స్క్రీన్స్ లో ప్రీమియం ధర 295 రూపాయిలుగా నిర్ణయించారు. ఇక సింగిల్ స్క్రీన్ లో 150 రూపాయిలు బేస్ ప్రైస్‌గా ఉంది. ఇక త్రీడీలో మల్టీప్లెక్స్ లో శాకుంతలం సినిమా చూడాలంటే దానికి అదనంగా ధర నిర్ణయించారు. తెలంగాణలో ఈ స్థాయిలో శాకుంతలం సినిమాకు డబ్బులు పెట్టాలంటే ఫ్యామిలీ ఆడియన్స్ కు కష్టమే. ఫ్యామిలీస్ లో నాలుగురు కలిసి థియేటర్స్ కి వెళ్లి మూవీ చూడటం కష్టమే అనే మాట వినిపిస్తుంది. అయితే ఏపీలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలలోనే టికెట్లు అమ్మాల్సి ఉంటుంది. ఈ నేపధ్యంలో తెలంగాణతో పోల్చుకుంటే ఏపీలో ధరలు తక్కువగా ఉన్నాయి. ఏపీలో ప్రీమియర్ ధర 177 రూపాయిలు ఉంటే బేస్ ప్రైస్ 145 రూపాయిలుగా ఉంది. కొంత వరకు ఫ్యామిలీ ఆడియన్స్ కి అందుబాటు ధరలలోనే ఏపీలో టికెట్లు ఉన్నాయని చెప్పొచ్చు. మరి ఈ స్థాయిలో ధరలతో థియేటర్స్ లో ఏ మేరకు ప్రేక్షకులని చిత్ర యూనిట్ రప్పించగలుగుతుంది అనేది చూడాలి.

# ఆస్కార్ అవార్టీలకు ఇలానేనా సన్మానం

### కీరవాణి, బోస్‌లకు సన్మాన కార్యక్రమంపై పెదవివిరుపు

ఆస్కార్ అందుకుని వచ్చిన దిగ్గజాలకు సన్మానం అంటే ఏ రేంజ్‌లో ఉండాలి? అందులోనూ తెలుగు చలన చిత్ర పరిశ్రమ తరపును వ్యక్తిగతంగా నిర్వహిస్తుందంటే? ఇంకే స్థాయిలో ఉండాలి. ధూమ్ ధామ్ దద్దరలిల్లాలి. ప్రపంచమే మరోసారి తెలుగు సినిమా వైపు చూసేలా ఉండాలి. ఊరూవాడ నలు దిక్కులు పిక్కటిల్లేలా ఉండాలి. హంగులు..ఆర్భాటాలతో చుట్టు పక్కల పరిశ్రమలన్ని ముక్కున వేలేసుకునేలా ఉండాలి. కానీ ఆదివారం శిల్పకళా వేదికలో జరిగిన వేడుక అలా నిర్వహించకపోవడంతో ఇప్పుడు సర్వత్రా విమర్శలు పదునెక్కాయి. తెలుగు చలన చిత్ర పరిశ్రమ తరుపున 'నాటు నాటు' కి సంగీతం అందించిన కీరివాణికి..ఆ పాట రచన చేసిన చంద్రబోస్ కి సన్మానం తూతూమంత్రగా కానిచ్చేసారు. కనీసం వేదికపై తారలు కూడా కరువయ్యారు. ఈ వేదిక పై కొంత మంది అగ్ర నిర్మాతలు.. దర్శకులు.. సాంకేతిక నిపుణులు మాత్రమే కనిపించారు. స్టార్ హీరోలెవరు కూడా వేదిక పై కనిపించలేదు. కనీసం రామ్ చరణ్ గానీ....ఎన్టీఆర్ గానీ కూడా హాజరు కాలేదు. వాళ్లిద్దరు అందుబాటులో లేకపోవడంతో రాలేదు. మిగతా హీరోలు కూడా బిజీ షెడ్యూల్ కారణంగా రాలేదా? లేక పరిశ్రమ తరుపు ఆహ్వానం అందినా అశ్రద్ధ చేసారా? అన్నది తెలియదు. పరిశ్రమ తరుపునైతే ప్రతీ హీరోకి కచ్చితంగా ఆహ్వానం వెళ్తుంది. విధిగా నిబంధనల ప్రకారం పరిశ్రమ తరుపున కమిటీ చేయాల్సిందంతా చేస్తారు. మరి చేసారా? లేదా? అన్నది తెలియదు. కానీ ఇలాంటి వాటిని హీరోలే స్కిప్ కొడుతుంటారని సహజంగా విమర్శలున్నాయి. ఏది ఏమైనా కనీసం పేరున్న హీరో ఒక్కరు కూడా కనపించకపోవడం శోచనీయంగానే భావించాలి. కేవలం కొంతమంది రాజకీయ నాయకులు..ప్రభుత్వ పెద్దల సమక్షంలో సింపుల్ గా ఈవెంట్ ముగించినట్లు తెలుస్తోంది. ఎలాంటి ఎంటర్ టైన్ మెంట్ ప్రోగ్రామ్ లు కూడా పెద్దగా నిర్వహించినట్లు లేదు.





# మహేశ్-రాజమౌళి కాంబినేషన్

### తమిళ,మళాయల స్టార్స్ నటించే ఛాన్స్

మహేశ్‌బాబు.. రాజమౌళి. 'ఎస్ఎస్ఎంబీ29' ఈ కాంబో కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఇంకా సినిమా సెట్స్ మీదకు వెళ్లలేదు కానీ రోజుకో వార్త నెట్టింట వైరల్ అవుతోంది. భారీ అంచనాలు మొదలైపోయాయి. యాక్షన్ అడ్వెంచర్ డ్రామాగా ఈ చిత్రం ఉండబోతోందని హింట్ ఇచ్చారు. హీరో, దర్శకుడు, బ్యానర్ మినహా సినిమాకు సంబంధించి ఏదీ అధికారికంగా ప్రకటించలేదు. హీరోయిన్లు ఎవరు, ఎంతమంది అన్నది ఇంకా తెలీదు. కానీ ఎవరి ఊహల్లో వారు ఉన్నారు. మూడు రోజుల క్రితం ఈ సినిమా గురించి ఓ వార్త నెట్టింట హల్‌చల్ చేసింది. ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర కోసం ఇద్దరు తమిళ సూపర్‌స్టార్‌లను, ఓ మలయాళ స్టార్‌ను సంప్రదించారనే వార్త ట్రెండ్ అయింది. ఆ పాత్ర కోసం విశ్వనాయకుడు కమల్‌హాసన్‌తో టచ్‌లోకి వెళ్లినట్లు ఓ వార్త బయటికొచ్చింది. ఇప్పుడు కమల్‌హాసన్‌తో పాటు చియాన్ విక్రమ్‌ను, మలయాళం నుంచి పృథ్వీరాజ్ సుకుమారన్ పేర్లు కూడా వినిపిసున్నాయి. మరి కమల్‌హాసన్, విక్రమ్, పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ ముగ్గురుకి ఈ చిత్రంలో ఛాన్ ఉందా? లేక ముగ్గురిలో ఒకర్ని సెలెక్ట్ చేస్తారా అన్నది చూడాలి. 'ఎస్ఎస్ఎంబీ 29'లో ముగ్గురు హీరోయిన్‌లకు స్కోప్ ఉందని మొదటి నుంచి వినిపిస్తోంది. ఇప్పుడీ చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. మహేశ్‌బాబు పక్కన హీరోయిన్‌గా అలరించేది ఎవరా? అని సెర్చింగ్ మొదలైంది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకోన్ ఓ కథానాయిక అని చాలాకాలంగా వార్తలొస్తున్నాయి. సెకెండ్ లీడ్‌లో హాలీవుడ్ హీరోయిన్ జెన్నా ఒర్టెంగా కనిపించనుందని టాక్ వినిపిస్తోంది. ఇప్పుడు తెరపైకి మరో పేరొచ్చింది. మూడో హీరోయిన్‌గా అతిలోకసుందరి శ్రీదేవి గారాల కూతురు జాన్వీకపూర్ కూడా ఈ చిత్రంలో భాగం కానుందనే వార్త సోమవారం నెట్టింట వైరల్ అవుతోంది. బోనీకపూర్ స్వయంగా రాజమౌళిని రిక్వెస్ట్ చేశారని ట్విట్టర్‌లో ట్రెండ్ అవుతోంది. మరి వీరిలో ఎవర్ని జక్కన్న ఫైనల్ చేస్తారో చూడాలి. ప్రస్తుతం మహేశ్ త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎస్-ఎస్ఎంబీ28 చేస్తున్న సంగతి తెలిసింది. తదుపరి రాజమౌళి సెట్‌లో అడుగుపెడతారు మహేశ్. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఈ చిత్రం సెట్స్ మీదకెళ్లనుందని సమాచారం.

# వకీల్‌సాబ్‌కు సీక్వెల్ యత్నాలు

### దర్శకుడి ప్రకటనతో అభిమానుల్లో ఖుషీ

పవన్ కల్యాణ్.. ఈ పేరు వింటేనే ఆయన ఫ్యాన్స్ పూనకాలతో ఊగిపోతుంటారు. అలాంటి పవన్ కల్యాణ్ సినిమా వస్తుందంటే మరింత ఖుషీ అయిపోతుంటారు. అయితే ఇటీవల పవన్ కల్యాణ్ అటు సినీ రంగంలో ఇటు రాజకీయ రంగంలో అడుగులు వేస్తున్నారు.కొన్నాళ్లు అక్కడ మరి కొన్నాళ్లు ఇక్కడ బిజీబిజీగా గడుపుతున్నారు. అయితే ఈ మధ్య వరుస సినిమాలకు సంతకాలు చేసి.. షూటింగ్ లు పూర్తి చేసుకుంటూ దుసుకెళ్తున్నారు. ఈక్రమంలోనే ఆయన మరో సినిమా గురించి లేటెస్ట్ అప్ డేట్ బయటకు వచ్చింది. పవన్ కల్యాణ్ కెరియర్ లో ఎన్నో సినిమాలు సూపర్ డూపర్ లు హిట్లు అయినప్పటికీ... వకీల్ సాబ్ సినిమాకు ఉన్న క్రేజే వేరు. ఎందుకంటే ఎన్నో ప్రతికూల పరిస్థితుల మధ్య విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్టుగా నిలిచింది 2021 ఏప్రిల్ నెలలో విడుదలైన ఈ చిత్రానికి ఓ వైపు కరోనా మరోవైపు టికెట్ల పెరుగుదల సమస్యలు వచ్చినా బాక్సాపీసును షేక్ చేసింది. ఇంత పెద్దగా హిట్టుగా నిలిచిన ఈ చిత్రానికి సీక్వెల్ ఉండబోతోందని తెలుస్తోంది. ఇటీవలే దర్శకుడు వేణు శ్రీరామ్ వకీల్ సాబ్ 2 ఉందని క్లారిటీ ఇవ్వడంతో పీకే అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. వకీల్ సాబ్ చిత్రం రిలీజ్ రెండేళ్లు అవుతున్న క్రమంలో ఆయన అభిమానులు ట్విట్టర్ వేదిగా ఒక స్పేస్ ను నిర్వహించారు. ఇందులో పాల్గొన్న డైరెక్టర్.. వకీల్ సాబ్ కు సీక్వెల్ ఎ÷–లాన్ చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం స్క్రిప్ట వర్క్ జరుగుతోందని... దీనిపై త్వరలోనే ఓ ప్రకటన చేస్తామని క్లారిటీ ఇచ్చారు.ఈ విషయం తెలుసుకున్న పవన్ కల్యాణ్ అభిమానుల ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. తమ అభిమాన నటుడి హీరో సినిమా అంటే తెగ ఖుషీ అవుతున్నారు. కరోనా సమయం టికెట్ల ధరల పెంపుదల ఉండగా... అసలు రిలీజ్ అవుతుందా లేదా అని భావించిన వకీల్ సాబ్ రిలీజ్ అయి సంచలనం సృష్టించింది. కరోనా వల్ల థియేటర్లు మూసేసే సమయానికే వకీల్ సాబ్ 90 కోట్ల రూపాయలను వసూలు చేసింది. మరో వారం రోజులు థియేటర్లు ఉన్న వంద కోట్ల క్లబ్ లో చేరుండేదని అంతా అనుకున్నారు. దీంతో అభిమానుల్లో కొంత నిరాశ నెలకొంది. అయితే ఇప్పుడు వీల్ సాబ్ 2 వార్తలపై డైరెక్టర్ క్లారిటీ ఇవ్వడంతో అందరి కన్నూ ఈ చిత్రంపై పడింది. త్వరగా అప్ డేట్ వస్తే బాగుండనుకుంటూనే.. ఈ చిత్రం అయినా వంద కోట్ల క్లబ్ లో చేరాలని అనుకుంటున్నారు. మరి చూడాలి ఈ చిత్రం ఎలా ఉండబోతుందో.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com